# విష్ణుసహస్రనామ అంతరార్థము



బ్రహ్మశ్రీ యల్లంరాజు శ్రీనివాసరావు

## ఉపశ్రుతి

సహస్ర నామాలు ఎన్నో ఉన్నాయి సంస్కృత వాఙ్మయంలో, కాని అన్నీ ప్రాచీనమైనవి కావు. ప్రాచీనమనే పేరుతో చెలామణి అవుతున్న అర్వాచీన రచనలు, పోతే నిజంగా ప్రాచీనమైన స్తోత్రాలు కొన్ని మాత్రమే. వాటిలో చాలా ప్రసిద్ధమైనవీ ఎంతో ప్రధానమైనవీ రెండే రెండు. లలితా సహస్రనామమొకటి, విష్ణు సహస్రనామ మొకటి. ఇందులో లలితా సహస్రం బ్రహ్మాండ పురాణంలో హయగ్రీవుడగస్త్యుడికి బోధించినదైతే విష్ణు సహస్రం మహాభారతంలో భీష్ముడు ధర్మరాజు కుపదేశించింది. మొత్తంమీద రెండూ వ్యాసప్రోక్తమైనవే, సందేహంలేదు.

అయితే మహర్షి ఒకటి స్త్రీ దేవతాపరంగా మరొకటి పురుషదేవతా పరంగా వ్రాయటంలో ఏమిటాయన అభిప్రాయం. దేవతలో స్త్రీ పురుష భేదముందనా కాదు. ఆ మాటకు వస్తే 'నైవస్త్రీ నపుమానేష - నైవ చాయం నపుంసకః' అని ఉపనిషత్తు చాటుతున్నది. అది స్త్రీ గాదు పురుష గాదా పరతత్త్వం. ఉపాధి భేదాన్ని బట్టి మనం కల్పించుకొన్న మూర్తులివి. నామ రూపాద్యుపాధుల వల్లనే అమూర్తమైన తత్త్వం మూర్తమై కనబడుతుంది. ఎందుకీ కల్పన అంటే సాధకుల కది ఒక ఆలంబనం. సాధకు డుపాసకుడైతే వాడి అభిరుచిని బట్టి శక్తిరూపంగానో శివరూపంగానో ఆరాధిస్తూ పోతాడా తత్త్వాన్ని, జ్ఞాని అయితే

సగుణమైన ఈ రెండింటి ద్వారా నిర్గుణాన్ని అందుకొని ఆ భావనలో దీన్ని ప్రవిలయం చేసుకొంటాడు.

ఇలాంటి అద్వైత భావనతోనే ఎప్పటికైనా మనమా పరతత్త్వాన్ని అందుకొని తరించవలసి ఉంది. సగుణోపాసకుడు కూడా చివరికీ నిర్గుణమైన జ్ఞానంద్వారా గాని ముక్తి పొందలేడు. కనుకనే లలితా, విష్ణు అని సహస్రనామాలు చెబుతున్నా ఇన్ని నామాలూ, ఇన్ని రూపాలు ఉన్నాయనిగాదు వ్యాసహృదయం. వీటన్నింటినీ అనామక మరూపకమైన పరమాత్మ చైతన్యంలో లయం చేసి దానినీ సాధకుడాత్మ చైతన్యంతో అభిన్నంగా భావించాలని. అందుకేనేమో సగుణనామాలతోపాటు నిర్గుణ నామాలు కూడా జతచేసి వర్ణిస్తూ పోతాడు రెండు స్తోత్రాలలో. ఎన్నో నామాలు రెండింటిలో ఏకరూపంగా కూడా కనిపిస్తాయి. శుద్ధ, సులభ, ముక్త, పరాయణ, ఇలాంటివి కుప్పతెప్పలు. దీనిమూలంగా లలితా-విష్ణు అని స్త్రీ పుంసభేదమా తత్త్వంలో చూడరాదని చాటుతున్నాడు మహర్షి. అంతేకాదు బ్రహ్మరూపా - గోవిందరూపిణి ఇత్యాదిగా దేవిని శర్వ-శివ అజ బ్రహ్మ-కేశవ విష్ణు అని దేవుని వర్ణించటాన్ని బట్టి త్రిమూర్తి భేదం కూడా చూడరాదని చాటినట్టయింది. మరి ఆత్మా అనే నామం రెండింటిలో పేర్కొనటాన్ని బట్టి చూస్తే నామలింగరూపభేద రహితమే గాదు. వస్తుతః అది ఈ సాధకుడి స్వరూపమేనని కూడా ఒక గొప్ప రహస్యాన్ని బయటపెడుతున్నాడాయన. చివరకు లలితా విష్ణు అనే మాటలకు కూడా అర్థం శివపత్ని పార్వతి-లక్ష్మీపతి విష్ణువని కాదు. ప్రకృతి

పురుషతత్త్వాలనే వ్యాసహృదయం. పద్మనాభ సహోదరి అనే దేవీనామంలో ఇదే గుప్తంగా సూచించాడు. ఒకే పరమార్థమనే ఉదరాన్ని చించుకొని బయటపడ్డాయి రెండు భాగాలు. ఒకటి జ్ఞానశక్తి. మరొకటి క్రియాశక్తి. రెండూ ఒక దానికొకటి అవినాభూతం.

ఇదుగో ఇలాంటి అద్వైత బ్రహ్మాత్మభావాన్ని వ్యాసభగవానుడీ రెండు స్తోత్రాల ద్వారా సాధకలోకానికెలా అందించాడో వ్యాఖ్యానించి చూపాలని నా సంకల్పం. దాని కనుగుణంగా ఇంతకుముందు లలితాష్టోత్తర శతాన్ని వివరిస్తూ ఒక గ్రంథం రచించాను. అది ఇంకా వెలుగు చూచే లోపుగా కొందరు జిజ్ఞాసువుల కోరిక మేరకీ విష్ణు సహస్ర వ్యాఖ్య ముందుగా ముద్రించవలసి వస్తున్నది. వివక్షితమైన తత్త్వమొక్కటే అయినప్పుడేది ముందైనా నష్టం లేదు. ఎటు వచ్చీ తత్త్వాన్నీ గుర్తించకుంటేనే నష్టం. అది ప్రతి నామంలోనూ లోతుకు దిగి చూడవలసి ఉంది మనం. నామాలకు కూడా ప్రసిద్ధమైన వాచ్యార్థం చెబితే సరిపోదు. ఇవన్నీ గుణనామాలు సుమా-ధాత్వర్థంతో ముడిపెట్టి అర్థం చెప్పుకోమని హెచ్చరించాడు మహర్షి. అంచేత తదాదేశానుసారం నామాలను నిర్వచిస్తూ వాటి అంతరార్థం, పరమార్థం వరకూ ప్రయాణం చేయాలి మనం. లేకపోతే విష్ణు నారాయణ, గోవింద, అధోక్షజ, శివ, కేశవ అన్నిటికీ ఒకే అర్థం రొకటి పాటగా చెప్పుకొంటూ పోవలసి వస్తుంది. పైగా న్యగ్రోధోదుంబరః అశ్వత్థః - అభిప్రాయః - ఇలాంటి వాటికేమని చెబుతావర్థం. కాబట్టి ఎంతో భావన చేయవలసి ఉంది నామాన్ని వివరించేటప్పుడు. ప్రతి నామమూ సాధకుణ్ణో పరమాత్మనో, సాధన

మార్గాన్నో - సిద్ధినో నాలుగింటిలో ఏదో ఒక దాన్ని సూచిస్తూనే ఉంటుంది. నాలుగని పేరేగాని నాలుగూ కలిసి ఒక్కటే. ఆ ఒక్కటే సహస్రముఖాలతో ఘోషిస్తున్నదీ సహస్రనామం. మనం వికర్ణులమూ, కుంభకర్ణులమూ కాక సుకర్ణులమై ఆలకిస్తేనే ఆ భగవద్వాణి మనకు వినిపిస్తుంది. విజ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. ఆ ప్రసాదాన్ని నేనందుకొని తమకందరికీ పంచిపెట్టటమే మహావిష్ణు సేవగా భావిస్తూ సెలవు తీసుకొంటున్నాను.

ఇట్లు

**భవద్విధేయః శ్రీరాయః**

శ్రీ మహాగణాధిపతయే నమః

# విష్ణు సహస్రనామ అంతరార్థము

**విశ్వమ్ విష్ణుః వషట్కారః** విష్ణు సహస్ర నామమిది - విశ్వమనే నామంతో ఆరంభ మవుతున్నది. ఏమిటి సబబు. విశ్వం మనకు సమస్య. విష్ణువు దానికి పరిష్కారం. మొదట సమస్యను తరువాత దానికి పరిష్కారాన్ని సూచించటం పరిపాటి. విశ్వమనేది ఇహమైతే యజ్ఞ సంబంధి అయిన వషట్కారం పరాన్ని సూచిస్తున్నది. మధ్య ఉన్న విష్ణు శబ్దం దేహళీదత్త దీపం లాగా రెండింటినీ వ్యాపించి ఉంది. దీన్ని బట్టి ఇహపరాలు రెండూ విష్ణువు కంటే వేరుగా లేవు. రెండూ విష్ణువేనని చెప్పినట్టయింది.

**భూత భవ్య భవ త్ప్రభుః** ఇహపరాలే కావు. భూత భవిష్యద్వర్తమానాలని మనం చెప్పుకొనే మూడు కాలాలు కూడా విష్ణుతత్త్వమే. ప్రకర్షేణ భవతీతి ప్రభుః - మూడింటికీ ప్రభువని కాదు. మూడుగా అయినవాడు విష్ణువేనని అర్థం.

**భూతకృత్ భూతభృత్ భావః** అంతేకాదు. చరాచర పదార్థాలను సృష్టిస్తున్నది - వాటిని పోషిస్తున్నదీ - తుదకు వాటిని తనలో కలుపుకొంటున్నదీ భావయతి అంతర్భావయతీతి - ఆ విష్ణువే - ఈ విధముగా దేశకాల వస్తువులనే మూడింటినీ వ్యాపించిన తత్త్వమేదో అది విష్ణువు. విష్ల వ్యాప్తౌ. ఏది వ్యాపిస్తుందో అదీ విష్ణుశబ్దార్థం.

**భూతాత్మా భూతభావనః** వ్యాపించటమంటే దేశకాల వస్తువులనేవి మూడూ దానికి భిన్నంగా ఉండి అది వీటిని వ్యాపించిందని కాదు. సమస్త భూతాలకూ అది ఆత్మ. అంటే స్వరూపం. ఆభరణాలకు బంగారం లాగా. బంగారాని కాభరణాలు వేరుగా లేనట్టే విష్ణుతత్వానికి భిన్నంగా దేశకాలాదులు లేవు. అంటే అపరిచ్ఛిన్నమైన పరమాత్మ చైతన్యమే దేశకాల వస్తువులనే పరిచ్ఛేదత్రయంగా (Three Dimensions) భాసిస్తూ ఉందని తాత్పర్యం. భూత భావనః అంటే ఇదే అర్థం. భూతరూపేణ ఆత్మానమ్ భావయతి కల్పయతీతి

**పూతాత్మా పరమాత్మాచ** అలా భూత సృష్టి చేస్తూ పోతే వాటి మూలంగా అది కలుషితం కాదా అని మరలా శంకించరాదు. అది పూతాత్మ, పరిశుద్ధమైన స్వరూపం. చైతన్యమనేది నిరాకారం గనుక దానినేదీ అంటదు. సృష్టి చేస్తున్నా పరిశుద్ధమే. ఆకాశం ఎంత వర్షం కురుస్తున్నా తడుస్తుందా. అలాగే పరమాత్మ కూడా, పరమమైన ఆత్మ అది. భూత సంపర్కం లేనిదని అర్థం. అలాంటి సంపర్క మున్నది మనబోటి జీవాత్మ.

**ముక్తానాం పరమా గతిః** జీవాత్మకూడా వస్తుతః పరమాత్మ స్వరూపుడే. దేహేంద్రియాదులే నేనని తాదాత్మ్యం చెందటం మూలాన బద్ధుడయి కనపడు తున్నాడు. వీటినుంచి ముక్తుడైతే చాలు. అలాంటి ముక్త జీవులందరికీ పరమమైన గతి – పోయి చేరవలసిన స్థానమదే.

**అవ్యయః పురుషః సాక్షీ** పరమమైనది గనుకనే వ్యయం లేనిదది, మార్పు చెందదు. కారణం పూర్ణమైన పదార్థం. చలించటానికి లేదు. చలించ కుంటే ఎలా మారుతుంది. చలనం లేని దాకాశంకూడా ఉంది గదా అంటే అది ఆకాశానికి కూడా సాక్షి. చైతన్యం గనుక జడమైన ఆకాశాదులన్నింటినీ గమనించగలదది.

**క్షేత్రజ్ఞః** ఈ క్షేత్రాలన్నింటిలో జీవ రూపంగా ప్రవేశించి వీటిని
**అక్షర ఏవచ** గ్రహిస్తున్నది. క్షేత్రమంటే శరీరం - అది బ్రహ్మాండమైనా కావచ్చు. పిండాండమైనా కావచ్చు. బ్రహ్మాండంలో హిరణ్యగర్భుడుగా - పిండాండంలో మన బోటి జీవులుగా అవతరించి చూస్తున్నదదే. అవతరించిందనగానే అది క్షరం కాదు మరలా - అక్షరమే. జారిపడనిదే.

**యోగః** జారిపడినట్లు కనిపిస్తున్నదీ జీవుడు. ఈ జీవుడు మరలా దాన్ని
**యోగ విదాం నేతా** అందుకొనే యోగం లేదా ఉపాయమదే. అదే యోగుల నందరినీ
**ప్రధాన** నడుపుతూ పోతుంది. ప్రధానమనీ పురుషుడనీ ఈశ్వరుడనీ
**పురుషేశ్వరః** సాంఖ్యులు వర్ణించే మూడు తత్త్వాలూ కూడా ఆ పరమాత్మే.

**నారసింహ వపుః** నారమంటే జీవకోటి - సింహమంటే ఈశ్వరుడు. జీవేశ్వరులు
**శ్రీమాన్** రెండు రూపాలూ అదే. లేదా జీవభావాన్ని ధరించినదీ మరలా దాన్ని హింసించి (సింహ) ఈశ్వరభావాన్ని పొందేదీ అదే. అలాంటి శ్రీశక్తి ఉంది దానికి. అది దానికి నిత్యసిద్ధం.

**కేశవః** అలాంటి శ్రీమంతుడు గనుకనే క+అ+ఈశ - బ్రహ్మ విష్ణు
**పురుషోత్తమః** మహేశ్వరులనే సగుణ రూపంగానూ భాసించగలడు. లేదా పూర్ణమైన నిర్గుణ తత్త్వంగానూ నిలిచిపోగలడు. గుణ త్రయాత్మకంగా భాసిస్తే కేశవుడు. గుణాతీతంగా ఉండిపోతే పురుషోత్తముడు.

**సర్వః** సగుణంగా అది ఈ సర్వమూ అయింది. మరలా నిర్గుణంగా ఈ
**శర్వః** సర్వాన్నీ విదారణం చేసి (శౄ విదారణే) శర్వమయింది. రెండూ
**శివః** తానేగనుక అది ఎప్పుడూ శివమే. శుభప్రదమే. దానికి
**స్థాణుః** భిన్నమని చూస్తేనే అశివం. భిన్నంగా కనపడటం కేవల మాభాసే. చలించనే లేదది. అచలం. స్థాణువంటే అచలమనే అర్థం.

**భూతాదిః** అచలం గనుకనే భూతసృష్టి కంతటికీ ఆది అయిందది,

**నిధి రవ్యయః** ఆదేకాదు, అంతంకూడా 'నిధీయంతే అస్మిన్ భూతానీతి నిధిః సమస్త భూతాలూ దానిలోనే లీనమయి ఉన్నాయి. అవ్యయం, తరగతని నిధి అది.

**సంభవః** కనుకనే దాని నుంచే మరలా ఈ చరాచర భూతాలు
**భావనః** సంభవిస్తున్నాయి భావనః అదే వీటి నిలా నిలుపుతున్నది. మరలా
**భర్తా** వీటిని భరిస్తున్నది. అంటే తనలో ఇముడ్చుకొంటున్నదీ అదే.

**ప్రభవః** ప్రభుత్వమంటే సామర్థ్యం. అలా ఈ భూత జాతాన్నంతా
**ప్రభుః** సృష్టించే (ప్రభవ) పోషించే (ప్రభు) తనలోనే లయం చేసుకొనే
**ఈశ్వరః** (ఈశ్వర) శక్తి ఉంది దానికి.

**స్వయంభూః** దానికి మాత్రమే సృష్టి స్థితి లయాలు మూడూలేవు. అది తన
**శంభుః** పాటికి తాను స్వయంగానే ఉంటుంది. శమ్–సుఖంగా ఉంటుంది.

**ఆదిత్యః** ఆది+త్య = ఆది నుంచీ అలాగే ఉంటున్నది. పుష్కలమైన
**పుష్కరాక్షః** దృష్టి లేదా జ్ఞానముంది దానికి. పుష్కరమంటే ఆకాశమని
**మహాస్వనః** కూడా అర్థం. ఆకాశంలాగా అనంతమైనదా జ్ఞానం. అలాగే అనంతమైన స్వనం లేదా శబ్దరూపమైన ప్రాణం కూడా ఉంది. అంటే జ్ఞాన క్రియాశక్తులు రెండూ పరిపూర్ణంగా ఉన్న తత్త్వమది.

**అనాది నిధనః** జ్ఞాన ప్రాణ స్వరూపమే గనుక దాని కొకప్పుడు జననమూలేదు.
**ధాతా** మరొకప్పుడు మరణమూ లేదు. అనాది నిధనమది. అవి రెండూ అది తనలోనే ధరించి ఉన్నది. ధాత అంటే ధరించి ఉందనే అర్థం. తాను ధరించినవి తన్నెలా మించి పోగలవు.

**విధాతా ధాతు రుత్తమః** మీదు మిక్కిలి అదే వాటినీ జీవులకు పంచిపెడుతుంది. విదధాతి. ఉత్తమమైన చైతన్య ధాతువది. జీవుడిదీ చైతన్య ధాతువే. అయినా అది ఉత్తమం కాదు. దేహేంద్రియాదులతో కలుషితమైనది.

**అప్రమేయః** మరి దానికో, దేహేంద్రియాదులైన ఉపాధులు లేవు. అప్రమేయ మది. ప్రమేయం కాని దప్రమేయం. ప్రమేయమంటే ఒకదాని చేత కొలవబడేది. నామరూపాలే దేనినైనా కొలిచేవి. అవే ఈ దేహేంద్రియాదులు. వీటిలో బందీ అయినది కాబట్టి జీవ చైతన్యం ప్రమేయం. దానికీ స్పర్శ లేదు కాబట్టి అప్రమేయం. అప్రమేయం గనుకనే ఉత్తమమని చెప్పటం.

**హృషీకేశః** అంతేకాదు. హృషికేశుడు కూడా పరమాత్మ. హృషీకమంటే హర్షాన్ని కలిగించే ఇంద్రియ వర్గం. దాని కధీశుడాయన. అధీనుడు కాడు. ఇంద్రియాదుల స్పర్శ లేదన్నప్పుడధీనుడనే మాటే చెల్లదు.

**పద్మనాభః** పైగా చరాచర ప్రపంచాలనే పద్మాలకు నాభి-కేంద్రస్థానమది. నాభి చక్రాన్ని తిప్పినట్టు అది వాటిని తిప్పుతున్నది. దానినవి ఏమీ చేయలేవు. ఆభాస ఇవి. వస్తువా పరమాత్మ.

**అమరప్రభుః** కనుకనే అమరుడాయన. దేవతల అమరత్వంలాగా ఆపేక్షికం కాదు. నిరపేక్షమైన అమరత్వమది. అందుకే అమరులకు కూడా ప్రభుడాయన.

**విశ్వకర్మా మనుః త్వష్టా** తాను అమరుడయి మరమైన ఈ విశ్వాన్ని తయారుచేశాడు. విశ్వమంతా ఆయన కర్మ, పనితనమే. దేనితో చేశాడిది. సామగ్రి ఏమిటి. మనుః మననమే-ఆలోచనే సామగ్రి, సంకల్ప మాత్రంతోనే జరిగింది ఈ సృష్టి. తన్ను తాను తొలచుకొని

# శ్రీ విష్ణు సహస్రనామ అంతరార్థము



వ్యాఖ్యాత :

బ్రహ్మశ్రీ యల్లంరాజు శ్రీనివాసరావు

తానే సృష్టిగా మారిపోయాడు. త్వష్ట అంటే తొలిచేవాడనే అర్థం. విశ్వకర్మా అంటే మరో అర్థం. విశ్వుడంటే జీవుడు, వీడు చేసే కర్మలన్నీ పరమాత్మ చేసేవే. మనుః మనసుతో చేసేవీ–త్వష్టా–ప్రాణంతో చేసేవీ అన్నీ.

**స్థవిష్ఠః**
**స్థవిరః**
**ధ్రువః** జీవులమైన మనకూ ఉంది ఆలోచనా – క్రియా. ఇది స్థవిరమే. దృఢమైనదే ఈ శక్తి. కాని అది స్థవిష్ఠమాయన శక్తి. మనకున్నది అధ్రువమైతే ఆయనది ధ్రువం.

**అగ్రాహ్యః** అధ్రువం గనుకనే మన బుద్ధి దాన్ని గ్రహించలేదు. అది అగ్రాహ్యం, మనస్సుకూ వచస్సుకూ కూడా అతీతం.

**శాశ్వతః** మనం గ్రహించకపోయినా అది ఎప్పుడూ ఉంది. శాశ్వతమే, అయినా కనపడదు.

**కృష్ణః** ఉన్నప్పుడు కనపడటానికేమి ? కృష్ణః ఆకాశంలాగా నల్లనిది. ఆకాశం మన దృష్టి కెలాగో అలాగే మనోదృష్టి కడ్డుతగిలి మనలను ముందుకు సాగనీయదు.

**లోహితాక్షః** అయితే మనం చూడకపోయినా మన మనసు మొదలుకొని అన్నింటినీ చూస్తూ ఉన్నదది. రోహితమంటే ఎరుపనీ పెరిగి పోయినదని కూడా అర్థమే. ఎరుపు రజోగుణం. రజస్సు చలనాత్మకం. అంతటా ప్రసరిస్తూ పెద్దదైన దృష్టి అది. అన్నింటినీ కనిపెట్టటంలో ఆశ్చర్యమేముంది.

**ప్రతర్దనః**
**ప్రభూతః** తర్దనమంటే నశింపజేయటం. భూతమంటే కల్పించటం, సమస్తాన్నీ నశింపజేస్తున్నదీ–మరలా కల్పిస్తున్నదీ కూడా అదే. రెండు శక్తులూ ఉన్నాయి దానికి. ఘటనా ఘటన సమర్థం.

**త్రికకుబ్ధామ** కకుప్పంటే దిక్కు, మూడు దిక్కులా ప్రసరించిన తేజస్సది. ఏమిటా మూడు. అవస్థాత్రయమైనా కావచ్చు. పురత్రయమైనా కావచ్చు, అసలు అన్నింటికీ మూలమైన గుణత్రయమే కావచ్చు. మూడింటి లోనూ నిండి ఉన్నదా చైతన్య జ్యోతే. ధామమంటే జ్యోతిస్సే కాదు. నిలయం కూడా. గుణత్రయానికి నిలయం కూడా అదేనని అర్థం.

**పవిత్రం మంగళం- పరం** గుణాతీతం గను కనూ ! తేజోరూపం గను కనూ ! దానినేదీ అంటదు. అది ఎప్పుడూ పవిత్రమే, పరిశుద్ధమే. నహిజ్ఞానేన సదృశం - పవిత్రమిహ విద్యతే. తాను పవిత్రం కావటమే కాదు. తన ప్రభావంచేత ఈ జీవుల బుద్ధులను కూడా పవిత్రం చేయగలదు. అదే మనకు మంగళం - శ్రేయస్సు. పరమన్నందువల్ల శ్రేయస్సే కాదు, నిశ్శ్రేయసం - మోక్షమే.

**ఈశానః ప్రాణదః ప్రాణః** ఈశానమది. అన్నిటికీ సమర్థమైనది. మానవుడికీ ప్రాణశక్తి నిచ్చింది అదే. అసలు ప్రాణమనేది కూడా అదే. యాప్రజ్ఞా సప్రాణః అన్నట్లు జ్ఞానమే ప్రాణం. కదలకుంటే జ్ఞానం, కదిలితే ప్రాణం.

**జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః** ప్రాణరూపంగా మొట్టమొదట మన ఈ ఉపాధిలో ప్రవేశించింది అదే. అందుకే అది జ్యేష్ఠం. మిగతా కరణవర్గంకన్నా మొదటిది. జ్యేష్ఠమే కాక శ్రేష్ఠం కూడా. జ్ఞానంతోనే ఓతప్రోతమయి ఉంది కాబట్టి జ్యేష్ఠం. జ్ఞానంలాగా నిరాకారం గనుక శ్రేష్ఠం. అంతేకాక దాని మూలంగానే ప్రజాసృష్టి ఏర్పడుతూ అదే దీన్ని కాపాడుతున్నది గనుక ప్రజాపతి కూడా ప్రాణం.

**హిరణ్యగర్భః భూగర్భః** హిరణ్యమంటే బంగారంలాగా దీప్తిమంతమైన చైతన్యం. దాన్ని తనలో ఇముడ్చుకొన్నదీ ప్రాణం. అందుకే జీవాత్మ అని పేరు

వచ్చింది దీనికి. అయితే హిరణ్యగర్భమే గాక భూగర్భం కూడా అయిందిది. చైతన్యతత్త్వమే గాక అచేతనమైన పృథివీతత్త్వం కూడా చేరి ఉన్నదిందులో.

**మాధవః**
**మధుసూదనః**
దానితో మాధవుడయ్యాడీ జీవుడు, మా అంటే ప్రాపంచికమైన సంపద. దాన్ని పోగుచేసుకున్న ధవుడితడు, ధవుడంటే నరుడని ఒక అర్థం. ఇది మధువులాగా ఎంత ఆర్జించినా సుఖంలేదు. ఆరోపితమే గనుక ఎప్పటికీ మనకు దక్కదిది. కనుకనే దీన్ని ఎప్పటికప్పుడు సూదనం – నిర్మూలనం చేసి మనకు కనువిప్పు చేస్తున్నాడా మాధవుడు.

**ఈశ్వరః**
**విక్రమీ**
**ధన్వీ**
**మేధావీ**
ఈశ్వరుడాయన, ఈ మధువును కల్పించిన వాడాయనే. దీన్ని కల్పించటానికెలాగో నిర్మూలించటానికీ అలాగే ఉందాయనకు సామర్థ్యం. విరుద్ధమైన క్రమం విక్రమం. పరస్పర విరుద్ధమైన పోకడ పరమాత్మది. మనకంతుపట్టదు. ధన్వమంటే మరు భూమి. అలాంటి ఆభాసరూపమైన లక్ష్మినెందుకు సృష్టించాడా ధన్వి – మేధావి గనుక. మేధా అంటే మాయాశక్తి. అది కలవాడాయన.

**విక్రమః**
**క్రమః**
అది విక్రమమూ క్రమమూ రెండు మార్గాలలో ప్రసరించగలదా శక్తి. విక్రమం సృష్టి – క్రమం సంహారం.

**అనుత్తమః**
**దురాధర్షః**
ఏమిటది ఎందుకని అడిగేవాడు లేడు. అంతకుమించిన (ఉత్తము) వాడుంటే గదా. అనుత్తముడాయన. అంతేకాక దురాధర్షుడు, తేరిచూడ లేరెవ్వరూ. ఏకమే వాద్వితీయం గదా. ఎవరున్నారని.

**కృతజ్ఞః**
**కృతిః**
అయితే ఇంతేనా మనగతి. పరవాలేదు. మనం చేసే ప్రతిపనీ (కృత) కనిపెడుతూనే ఉన్నాడాయన. కృతజ్ఞుడే కాదు. కృతికూడా.

| | |
|---|---|
| **ఆత్మవాన్** | అసలీ పనికూడా ఆయన స్వరూపమే. మనమేమిటి. మన పనులేమిటి, అనాత్మ ఎక్కడ ఉంది. అంతా ఆత్మదే-ఆత్మే. |
| **సురేశః**<br>**శరణమ్**<br>**శర్మ** | మన మానవులేమిటి - సురలు స్వయం ప్రభువులమని విఱ్ఱవీగే దేవతలకు కూడా ఈశ్వరుడాయన. దేవ మానవ దానవులందరికీ శరణ్యుడు, వారందరి అనుభవానికీ వచ్చే శర్మ-సుఖ స్వరూపుడు. |
| **విశ్వరేతాః**<br>**ప్రజాభవః** | అచేతనమైన ఈ విశ్వానికంతా రేతస్సు-బీజస్వరూపుడు, పోతే చేతనమైన ప్రజా కోటికంతా భవ-జన్మకారకుడు. చేతనా చేతనాలు రెండింటికీ ఉపాదానమూ నిమిత్తమూ రెండూ పరమాత్మే. |
| **అహః**<br>**సంవత్సరః**<br>**వ్యాళః** | అహస్సులాగా ప్రకాశిస్తూనే ఉంటాడెప్పుడూ, అంటే నామ రూపాత్మకంగా గోచరిస్తూనే ఉన్నాడు. సంవత్+సర-నిత్యమూ కదులుతూ మెదులుతూనే ఉన్నాడు జీవరూపంగా. అయినా వ్యాళ అంటే శఠుడు. గూఢ విప్రియకృత్ శఠః అన్నారు. మన కనులు కప్పి తప్పించుకొని పోతుంటాడు. |
| **ప్రత్యయః**<br>**సర్వదర్శనః** | ప్రతి+అయ - మరలా వెనుకకు తిరిగి ప్రత్యగ్దృష్టితో చూడగలిగితే ప్రతి+అయ - మన దృష్టికే ఎదురుపడతాడు. అప్పుడీ సర్వ ప్రపంచమూ దృశ్యంగా కాదు - దర్శనంగానే భాసిస్తుంది. |
| **అజః**<br>**సర్వేశ్వరః**<br>**సిద్ధః** | అలాంటి దర్శనంతో ఆయనలాగా మనమూ అజులమే. జన్మించామని గాని జన్మించబోతామని గాని భావమే ఉండ బోదు. సర్వమూ కనిపిస్తున్నా దానికి బద్ధులం కాము. ఈశ్వరులమే. ఒక్క మాటలో చెబితే సిద్ధులం. |

| | |
|---|---|
| **సిద్ధిః** | ఆ మాటకు వస్తే సిద్ధికూడా వేరుగాదు. మనమే. పరిపూర్ణా ద్వైతంలో సిద్ధుడూ సిద్ధీ అనే తేడాలేదు. సిద్ధుడి స్వరూపమే సిద్ధి. |
| **సర్వాదిః**<br>**అచ్యుతః** | ఆ దత్తే ఇతి ఆదిః – సర్వసంహార రూపమని భావం. కనుకనే దాన్ని చ్యుతం చేసేది ఏదీలేదు. అచ్యుతమది, తన స్వరూపస్థితి నుంచి చ్యుతి లేదు దానికి. |
| **వృషాకపిః**<br>**అమేయాత్మా**<br>**సర్వయోగ**<br>**వినిస్సృతః** | తేజో ఉ బన్నాత్మకమైన సంసారాన్ని వర్షించేదీ (వృషా) అదే. ఈ జలాన్ని మరలా పీల్చేదీ (కపి) అదే.లేదా వృష-సృష్టిస్తూ అక – దీనిలో చరిస్తూ పి-దీన్ని లయం చేస్తున్నదని కూడా అర్థమే. అయినా ఈ మేయమైన సంసారం లేదు దానికి, అమేయాత్మా, అది అసలు మేయమైతే గదా ఇది ఏర్పడటానికి, కనుకనే ఏ ఉపాయంతోనూ పట్టుకోలేము దాన్ని, సర్వయోగ వినిస్సృతమది. యోగమంటే ఉపాయం. అన్ని ఉపాయాల నుంచి తప్పించుకుపోతుంది. |
| **వసుః**<br>**వసుమనాః**<br>**సత్యః** | తప్పించుకొని ఎక్కడికో పోదు మరలా. ఎక్కడ బడితే అక్కడే వసిస్తున్నది. మనలో మనోరూపంగా వసిస్తున్నదదే. సద్విశేషంగా కాక సద్రూపంగా మాత్రమే చూస్తే మనవెలపల ఉన్న ప్రతి ఒక్కటీ అదే (సత్య) |
| **సమాత్మా**<br>**అసమ్మితః**<br>**సమః** | మా అంటే ఈ ప్రపంచమే, దీనిలో సమంగా పరచుకొని ఉండేది. ఎంతపరచుకొని ఉందో అంత దీనిలో పట్టకుండా ఉంది. విశేషంలో సామాన్య మిమడదు గదా. అందుచేత సమ్మితం కాదు. అసమ్మితం. అయినా కూడా ఈ మాతో అనగా ఈ విశేష ప్రపంచంతోనే కలిసి ఉంది. అదీ చిత్రం. |

**అమోఘః పుండరీకాక్షః** మాతో కలిసి ఉన్నా మా ఓఘం (మోఘం) ఈ సంసార ప్రవాహం దానిమీద పనిచేయదు. అది అమోఘం. ఇది ఉందని చూచే మానవుడి హృదయపుండరీకం కేంద్రంగా చేసుకొని అన్నీ దర్శిస్తున్న

**వృషకర్మా వృషాకృతిః** (అక్ష) దది. ఏమిటా అన్నీ. మనం చేసే పుణ్యకర్మలు. వృషమంటే పుణ్యం, ధర్మం. అసలది వృషాకృతి– ధర్మస్వరూపం.

**రుద్రః బహుశిరాః బభ్రుః** ధర్మం మనచేత చేయిస్తున్నది కూడా అదే. ప్రాణరూపంగా మనలో చేరి అన్ని పనులూ చేస్తున్నది. రుద్రమంటే రోదించే లేదా ధ్వనించే ప్రాణస్పందం, బహుశిరాః బహుముఖాలుగా రక్తంలో చేరి ప్రసరిస్తున్నదది, మరలా ఈ బహు వ్యాపారాల నన్నిటినీ రాత్రి కాలంలో ప్రళయకాలంలో తనలోనే భరిస్తున్నది. బభ్రు.

**విశ్వయోనిః** విశ్వానికంతా యోని ఉత్పాదకమది. మరలా దానికీ విశ్వమే యోని. సాధించి పట్టుకోవలసిన ప్రమాణం.

**శుచిశ్రవాః** అయితే పట్టుకోటానికి శుచి అయిన శ్రవస్సు అంటే పరిశుద్ధమైన జ్ఞానమలవడాలి మనకు. జ్ఞానంతోనే జ్ఞానాన్ని పట్టుకోవాలి. భగవంతుడు జ్ఞానస్వరూపుడు. అది శుద్ధమైన కేవల జ్ఞానం. మన జ్ఞానమూ అలాంటిదే అయితే అందుకోగలదు. అదే బ్రహ్మాకారవృత్తి.

**అమృతః శాశ్వతస్థాణుః** అప్పుడే అది అమృతం. మృతమంటే మార్పు. మార్పులేని స్థితి అమృతం – శాశ్వతం కూడా. ఎప్పటికీ నిలుస్తుంది. స్థ+అణు, నిశ్చలమూ – అతిసూక్ష్మమూ అయిన తత్త్వమది.

**వరారోహః** శ్రేష్ఠమైన ఆరోహణమది సాధకులకు. అది కూడా గొప్ప తపస్సు.
**మహాతపాః** ఆలోచన చేసి ఆరోహించవలసిన స్థానం. అది అసలు తపస్స్వరూపం - యస్యజ్ఞానమయం తపః

**సర్వగః** ప్రజ్ఞానం గనుక అది సర్వగతం - అంతటా వ్యాపిస్తుంది.
**సర్వవిద్భానుః** సర్వవిద్ అన్నిటినీ గ్రహిస్తుంది. భాను-తాను భాసిస్తూంది. అన్నిటినీ భాసింపజేస్తుంది.

**విష్వక్సేనః** చరాచరజగత్తంతా దాని సైన్యమే. విష్వక్-అంతటా అదే.
**జనార్దనః** అందుకే జనులందరూ అర్దన కోరవలసిందేదో గాదు. అదే.

**వేదః** వేదమంటే జ్ఞానం. జ్ఞానమూ అదే, వేదవిద్, జ్ఞానాన్ని గ్రహించే
**వేదవిద్** జ్ఞాతా అదే. అవి+అంగ, విశేషించి ఏ శరీరంతోనూ సాంగత్యం
**అవ్యంగః** లేదు దానికి.

**వేదాంగః** ఉంటే దానికొక్కటే శరీరం - అది జ్ఞానమే.

**వేదవిత్** ఈ వేదం - ఈ జ్ఞానం చేతనే విండ్ - అందుకోవాలి దాన్ని,
**కవిః** అది కవి. క్రాంతదర్శి. దీనికతీతంగా ఉండి దీన్ని గమనిస్తున్నది.

**లోకాధ్యక్షః** లోకులందరినీ చూస్తున్నది. విశేషంగా సాధకులను (సుర)
**సురాధ్యక్షః** గమనిస్తున్నది, వారు చేసే ధర్మకార్యాలూ దర్శిస్తున్నది. కృతా
**ధర్మాధ్యక్షః** కృత. ఎవరు చేశారా చేయలేదా చేస్తే ఎంతవరకు చేశారా-ఇదీ
**కృతాకృతః** కనిపెట్టి చూస్తేనే ఉన్నది.

**చతురాత్మా** బ్రహ్మ-విష్ణు-రుద్ర-ఈశ్వర అని నాలుగు రూపాలు. వాసుదేవ
**చతుర్వ్యూహః** ప్రద్యుమ్న అనిరుద్ధ సంకర్షణ అని నాలుగు వ్యూహాలు-పరా
**చతుర్దంష్ట్రః** పశ్యంతీ మధ్యమా వైఖరులనే నాలుగు దంష్ట్రలలాటి శక్తి
**చతుర్భుజః** ప్రసారాలూ - ధర్మజ్ఞాన వైరాగ్యైశ్వర్యాలనే నాలుగు సిద్ధులూ గల విశ్వరూపుడా పరమాత్మ.

**భ్రాజిష్ణుః** ఈ చెప్పిన అన్ని దశలతో భ్రాజిష్ణు ప్రకాశిస్తూ ఇటు భోజ్యమైన
**భోజనమ్** ప్రపంచమై–అటు దీన్ని భక్షించే భోక్తా అంటే అన్నమూ
**భోక్తా** అన్నాదుడూ రెండూ తానే అయి కూచున్నాడాయన. అన్న మంటే గ్రాహ్యం. అన్నాద అంటే గ్రాహకం. గ్రాహ్య గ్రాహకాలు రెండూ పరమాత్మేనని భావం.

**సహిష్ణుః** అన్నింటినీ సహించే స్వభావమున్నవాడాయన. జగత్తుకంతా
**జగదాదిజః** ఆదిలోనే సిద్ధమయి ఉన్నాడాయన. తనలో నుంచి జన్మించిన జగత్తును భరించటంలో ఆశ్చర్యమేముంది.

**అనఘః** ఈ జగత్తునింతగా భరిస్తున్నా అనఘుడే, అఘమంటే అంటుకొనే
**విజయః** దోషం, నిరాకారుడు గనుక దీని అంటు సొంటు లేదాయనకు.
**జేతా** అదే ఆయన విజయం. దీనిచేత జితుడు కాడు, మీదు మిక్కిలి దీనికే జేత.

**విశ్వయోనిః** విశ్వుడంటే జీవుడు. ఈ జీవుడికి యోని, వీణ్ణి సృష్టించినవాడని
**పునర్వసుః** అర్థం. సృష్టించటమంటే వీడాయనకు విజాతీయుడు కాడు మరలా. ఈ జీవుడి రూపంలో పునః మాటి మాటికీ వసుః ఈ జరాయుజాది ఉపాధులలోకి వచ్చి నివసిస్తున్న వాడా ఈశ్వరుడే.

**ఉపేంద్రః** ఇంద్రుడంటే జీవుడు (ఇదం ద్రః ఇతి) ఈ జీవుడికి చాలా దగ్గరగా ప్రత్యగ్రూపంగా ఉన్నవాడు గనుక ఉపేంద్రుడాయన.

**వామనః** అయితే జీవుడు గుర్తించనంతవరకూ వామనుడు. హ్రస్వ
**ప్రాంశుః** మైనదా రూపం. గుర్తించే కొద్దీ పెరిగి పెద్దదై ప్రాంశువు – అంటే అత్యున్నతంగా భాసిస్తుంది.

**అమోఘః** మోఘః అంటే మోహం - అలాటి ఔన్నత్యమే అందుకొంటే ఇక మోహమే లేదు. అమోహుడే - అమోఘుడే జీవుడు.

**శుచిః**
**ఊర్జితః** మోహమే అసలైన కాలుష్యం. అది వదలిపోతే శుచిత్వమే. శుచి అయితే అంతకన్నా బలంలేదు. ఊర్జమంటే బలం. వీర్యం. అది ఉన్నవాడు ఊర్జితుడు.

**అతీంద్రః**
**సంగ్రహః**
**సర్గః** జీవరూపంగా కనపడుతున్నా (ఇంద్ర) అతీంద్రుడు వాడు. జీవతత్త్వాన్ని తనలోనే సంగ్రహించి ఉన్నాడా పరమాత్మ అసలు. అలా కాకుంటే మరలా సృష్టించలేడు. సర్గమంటే సృష్టి. ఉన్నదే బయట పడుతుంది. లేనిది పడదు.

**ధృతాత్మా**
**నియమః**
**యమః** తనలో నుంచి జీవభావాన్ని బయటపెట్టి మరలా దాన్ని తాను ధరించి కూచున్నది. ధృతాత్మ అంటే అదే అర్థం. అలా యమ నియమాల నవలంబించి సాధన చేస్తుంది.

**వేద్యః**
**వైద్యః**
**సదాయోగీ** సాధన చేసి తెలియవలసింది మరలా తన స్వరూపమే. దాన్ని తెలుసుకొనేవాడు తానే, తెలియబడవలసిన వాడైతే వేద్య ఈశ్వరుడు. తెలుసుకోదలిస్తే వైద్యుడు. వేదమంటే జ్ఞానం. అది ఇద్దరికీ సమానమే. సాధన చేయకున్నా వేద్య వైద్యులు (జీవేశ్వరులు) ఇద్దరూ సదా యోగులే. అవినాభావంగా కలిసి ఉన్న తత్త్వాలే.

**వీరహా** అయితే విశేషంగా ఈరణం (వి+ఈర) అంటే ప్రసరణ చెంది జీవ ప్రపంచాదులను పట్టుకొన్నాడీ జీవుడు. దానిని హా - హననం చేస్తే గాని ఆ ఐక్యం అనుభవానికి రాదు.

**మాధవః**
**మధుః** అది ఈ మా-సంసారానికి ధవుడైన ఈశ్వరుడే చేయాలి. చేస్తే జీవుడి కేర్పడ్డ ఈ వీరత్వం పోయి సంసారం మధువుగా మారు తుంది. మధువంటే ఇక్కడ అమృతం మోక్షపదమని భావం.

**అతీంద్రియః మహామాయః మహోత్సాహః మహాబలః**

మధువులాంటి ఆ అమృతత్త్వాన్ని అందుకొంటే ఈశ్వరుడిలాగా ఈజీవుడూ అతీంద్రియుడవుతాడు. మాయకధీనుడు కాక అధీశుడవుతాడు. గొప్ప ఉత్సాహాన్ని బలాన్నీ పుంజుకుంటాడు.

**మహాబుద్ధిః మహావీర్యః మహాశక్తిః మహాద్యుతిః**

అంతేకాదు, పరిపూర్ణమైన బుద్ధి లేదా జ్ఞానం – సమగ్రమైన వీర్యం. సమగ్రమైన శక్తి అలవడతాయి. అంతరమైనది వీర్యమయితే బాహిరమైనది శక్తి. వీటితోపాటు అద్భుతమైన ద్యుతి అంటే తేజస్సు కూడా లభిస్తుంది. ఇవన్నీ షాడ్గుణ్యం క్రిందికి వస్తాయి. ఈశ్వరుడిలో ఉన్న ఈ గుణాలే జీవుడికీ సంక్రమిస్తాయి.

**అనిర్దేశ్యవపుః శ్రీమాన్**

నిర్దేశించటమంటే చూపటం. వపువంటే శరీరం. ఫలానా అని చూపటానికి లేదా విగ్రహం, గుణాత్మకం కాదది. శ్రీ అంటే శక్తిరూపంగా అమూర్తమై ఉందా తత్త్వంలో. శ్రీమంతమైన ఆతత్త్వం నిరాకారం.

**అమేయాత్మా మహాద్రి ధృక్**

కనుకనే అది జీవుడి విగ్రహంలాగా మేయం కాదు. కొలమానాని కందదు. అమేయమైన చైతన్యం. నేననే భావంతో ఉన్న ఆత్మ స్వరూపం. అద్రి ఎప్పుడూ ద్రవించని చలించని అయినా చలించి అన్నింటినీ కబళించే మాయాశక్తి చేత ధృక్ అప్రధృష్యమది.

**మహేష్వాసః మహీభర్తా శ్రీనివాసః సతాంగతిః**

ఇష్వాసమంటే బాణాసనం. ధనుస్సు, గొప్ప బాణాసనమా మాయాశక్తి. అది విసరిన ఒక బాణమే ఈ భూతత్త్వం, మహి. ఈమహిని అది మరలా భరించే ఉన్నది. శ్రీనివాస. శ్రీలోనే నివసిస్తున్నదీ భూ. అవ్యక్తమైతే శ్రీ. వ్యక్తమైతే భూ, ఇది గుర్తించిన వివేకవంతులే సంతః – వారికి గతిః గమ్యమదే.

| | |
|---|---|
| **అనిరుద్ధః** | అనిరుద్ధ మా తత్త్వం. ఏదీ నిరోధించలేదు దాన్ని. అది |
| **సురానందః** | లయమూ (నిరోధ) కాదు. ఆత్మారాముల (సురలు) కానంద |
| **గోవిందః** | రూపం. స్వయంగా రాజిల్లే (సుర) ఆనందమది. గో–జ్ఞానం |
| **గోవిదాం పతిః** | చేతనే వింద అందుకోవలసిందా ఆనందం, అందుకే గో ఈ శరీరాలలోకి వచ్చిందది. శరీరధారులందరినీ సాధకులుగా మార్చి కాపాడేదది (పతి) |
| **మరీచిః** | చైతన్యజ్యోతి (మరీచి) అది. మరుమరీచి (ఎండమావులు) |
| **దమనః** | లాంటి సంసారమనే ఛాయను సృష్టించింది. దమన–కాల |
| **హంసః** | రూపంగా మరలా దాన్ని దమిస్తున్నది. ప్రాణ (హంస) రూపంగా అంతరజగత్తును కూడా నడుపుతున్నది. |
| **సుపర్ణః** | రెండు మంచి పర్ణాలు రెక్కలు అంటే ఉచ్ఛ్వాస నిశ్వాసాల |
| **భుజగోత్తమః** | రూపంతో రాకపోకలు చేస్తుంటుంది. భుజగోత్తమ అంటే కుండలినీ–శక్తిరూపంగా లోపల జేరి శరీరాన్ని ధారణ చేస్తున్నది. |
| **హిరణ్యనాభః** | రెండింటికీ నాభి కేంద్రస్థానం ఆ హిరణ్యమే. అంటే చైతన్య |
| **సుతపాః** | దీప్తి. సుతపాః తపస్సంటే జ్ఞానం. చాలా సమీచీనమైన జ్ఞానమది. |
| **పద్మనాభః** | తపస్సు చేసిందది. అంటే ఆలోచన చేసింది. చేసి ఈ అండ |
| **ప్రజాపతిః** | పిండాదులైన పద్మాలనన్నింటినీ సృష్టించింది. ప్రజ అంటే జీవకోటి. జరాయుజాదులైన ఈ జీవులందరికీ పతి. జీవనాధారమయింది. |
| **అమృత్యుః** | అదిమర్త్యం కాదు. మర్త్య మీ సర్వమే. సర్వమూ మర్త్యమైతే |
| **సర్వదృక్** | దృశ్యమైన ఈ సర్వాన్నీ దర్శిస్తున్న దృక్కది. సింహం : హింసించే |

**సింహః**
**సంధాతా**

దేదో అది సింహం. సర్వ దృశ్య ప్రపంచాన్నీ నిర్మూలించి నిష్ప్రపంచమైన స్థితిని ప్రసాదిస్తుంది సాధకుడికి. సంధాతా అంటే అలా సమకూర్చేవాడనే అర్థం.

**సంధిమాన్**
**స్థిరః**

అలా సంధించే గుణమందులో సహజంగానే ఉంది. సంధించినా సంధించకున్నా రెండు దశలలోనూ అది స్థిరమే.

**అజః**
**దుర్మర్షణః**
**శాస్తా**

వస్తుతః అది అజం. జీవజగద్రూపంగా ఎప్పుడూ జన్మించలేదు. అయితే ఈ రహస్యం గ్రహిస్తేనే సహిస్తాడు. లేకుంటే సహించడు. సహించడు. దుర్మర్షణుడు. శాస్తా – సద్గురు రూపంగా అవతరించి ఆ మార్గం మనకు శాసించి చెబుతాడు.

**విశ్రుతాత్మా**
**సురారిహా**

విశేషంగా శ్రవణం చేసిన వారికాత్మగా భాసిస్తాడు. అలా శ్రవణం చేయని అసురసంపద గల నాస్తికుల నంత మొందిస్తాడు. మాటి మాటికీ జనన మరణాదులను కల్పించటమే అంతమొందించటం.

**గురుః**
**గురుతమః**
**ధామ**

సాధకులకు గురువాయనే, గురుతముడు కూడా. పరమాత్మను మించిన గురువెవడున్నాడు. మిగతా గురువులంతా లోకాన్నే చూపితే ఈ జగద్గురువు మనకు పరమ తత్త్వాన్నే అనుగ్రహిస్తాడు. అది ఏదోగాదు. పరంధామం. అన్నిటికన్నా కడపటిదైన స్థానం.

**సత్యః**
**సత్య పరాక్రమః**

సత్ అమృతం – త – మర్త్యం – ఈ రెండు భావాలనూ యమిస్తున్నది య, అని ఛాందోగ్యం చెబుతున్నది. అప్పటికి మూర్తామూర్తాలు రెండూ పరమాత్మలోనే ఉన్నాయి.అదే ఈ ద్వంద్వాలను శాసిస్తున్నది. సత్యమంటే అది సచ్చత్యచ్చా భవత్ అంటున్న దుపనిషత్తు. ఉన్నదీ లేనిదీ రెండూ అదే. అదికూడా

అర్థమే సత్యమనే మాటకు. సత్యంలో నుంచి వచ్చింది గనుక ప్రపంచం కూడా సత్యమే. దానికీ సత్యం పరంగా కనిపిస్తున్నా దీనినాక్రమించే ఉందది. సత్యపరంగానే ఆక్రమ పయనిస్తుంటుందది. కనుక ఎప్పుడూ సత్యపరాక్రమమే.

**నిమిషః** **అనిమిషః** **స్రగ్వీ** నిమిషమంటే సవ్యాపారం. అనిమిషమంటే అవ్యాపారం. ఒకటి జంగమం, మరొకటి స్థావరం. ఒకటి చేతనం. మరొకటి జడం, రెండూ ఆ పరమాత్మే. ఈ చరాచర పదార్థాలే స్రజములు-దండలు. వీటిలో సూత్రంలాగా చేరి చెదరి పోకుండా ధరించి ఉన్నాడు కాబట్టి ఆయన స్రగ్వి.

**వాచస్పతిః** **ఉదారధీః** వాక్కంటే ఇక్కడ పరావాక్కు. పరాశక్తి. దానికి పతి ఆశ్రయ మైనదా పరమాత్మ. ధీ అంటే జ్ఞానం. అది పరిపూర్ణంగా ఉన్నవాడు ఉదారధీః ఇంతకూ జ్ఞానమూ శక్తీ రెండూ పూర్ణమే పరమాత్మకు. సర్వజ్ఞుడూ సర్వశక్తుడూ.

**అగ్రణీః** **గ్రామణీః** **శ్రీమాన్** సర్వజ్ఞుడూ సర్వసమర్థుడూ గనుకనే అగ్రణీః సర్వానికీ ముందుండి నడపగలడు. సాధకుల గ్రామం అంటే బృందాన్ని గమ్యంవైపు నడుపుతూ పోతాడు. దానికి తగిన స్తోమత శ్రీ ఉన్నవాడాయన. అది మనకా శ్రయణీయమైతే ఆయన దానికా శ్రయణీయం.

**న్యాయః** **నేతా** **సమీరణః** అసలా నడిపే ఋజువైన మార్గమూ తానే. నడిపే నేతా తానే, సమీరణ, చక్కగా నడిపే విధానమూ తానే ఆ పరమాత్మ. తనకు భిన్నంగా ఏదీలేదు.

**సహస్రమూర్ధా** **విశ్వాత్మా** వేయి తలలతో మోస్తున్నాడీ విశ్వాన్ని. విశ్వమంతా అయి తానే ఉన్నాడు. విశ్వాన్నంతా వేయికండ్లతో కనిపెట్టి చూస్తున్నాడు.

**సహస్రాక్షః**
**సహస్రపాత్**
విశ్వమంతా వేయి కాళ్ళు పెట్టుకొని సంచరిస్తున్నాడు. ఎక్కడ చూచినా తానే. ఏది చూచినా తానే.

**ఆవర్తనః**
**నివృత్తాత్మా**
**సంవృతః**
**సంప్రమర్దనః**
విశ్వమంతా సంచరిస్తున్నదీ తానే. విశ్వం నుంచి వైదొలగి కూచున్నదీ తానే. ఆవర్తనమంటే తిరగటం, నివర్తనమంటే మానేయటం. విభూతిగా విశ్వం. స్వరూపంగా విష్ణువు, స్వరూపంలోనే సంవృతం గుప్తమయి ఉన్నది విభూతి. దీనిని బాగా మర్దనం చేసి స్వరూపాన్ని పట్టుకోమనే బోధిస్తున్నాడు మనకు.

**అహస్సంవర్తకః**
**వహ్నిః**
**అనిలః**
**ధరణీ ధరః**
అహస్సంటే కాలం. కాలాన్ని వర్తింపజేశాడు. సృష్టించాడు. సృష్టించిన కాలచక్రాన్ని వహిస్తున్నాడు. చివర కనిలః ఇల అంటే చలించటం. చలించకుండా దాన్ని తనలో కలుపు కొన్నాడు. ఆ కాలమన్నింటినీ ధరించినదైతే దాన్ని శక్తిరూపంగా ధరించి ధరణీధరుడయినాడు.

**సుప్రసాదః**
**ప్రసన్నాత్మా**
నిరాకారం ఏకం గనుక సుప్రసన్నం, నిర్మలమైనదది. అది ఏదో గాదు. చైతన్యరూపమైన నైర్మల్యం గనుక ఆత్మ.

**విశ్వధృక్**
**విశ్వభుక్**
**విభుః**
విశ్వాన్నంతా అదుపులో పెట్టుకొని విశ్వాన్నంతా అనుభవిస్తూ విశ్వమంతా వివిధ రూపాలుగా వ్యాపించాడు. కనుక ఆ తత్త్వాన్ని గుర్తిస్తే సాధకుడు కూడా అలాగే అయిపోగలడు.

**సత్కర్తా**
**సత్కృతః**
**సాధుః**
కారణం. అసలాయన తన సత్తునే సద్విశేషంగా మార్చి చూపుతున్నాడు. మరలా ఈ విశేషాలను లయభావనతో చూస్తే సత్కృతుడే అవుతాడు. అప్పుడంతా సత్తే కాబట్టి సాధువే ఈ సృష్టి. అసాధువు కాదు.

**జహ్నుః** జహాతి. వదిలేసేదేదో అది జహ్ను. అదే సాధుత్వాన్ని విడిచి అసాధువైన జగత్తుగా భాసించింది. అర్థం చేసుకొంటే మరలా అసాధుత్వాన్ని విడిచి సాధువై కనిపిస్తుంది.

**నారాయణః నరః** ఇంతకూ నారాయణుడూ అదే. నరుడూ అదే. ద్విపాత్రాభినయం చేస్తున్నది. సత్తును వికల్పించి సద్విశేషంగా చూస్తే నరుడు, విశేషాలను సదాత్మకంగా దర్శిస్తే వాడే నారాయణుడు.

**అసంఖ్యేయః అప్రమేయాత్మా** నరుడేమిటి ? నారాయణుడేమిటి ? సమస్త రూపాలూ ఆయన రూపాలే, ఇన్ని అని సంఖ్యలేదు వాటికి. అసంఖ్యేయం. అప్రమేయం కూడా. ప్రమాణానికి గోచరించేది కాదు. ప్రత్యక్షాది ప్రమాణాలకు ముందే సిద్ధించి ఉన్న శుద్ధ చైతన్యమది.

**విశిష్టః శిష్టకృత్ శుచిః** శిష్టమంటే మిగులు. తనకదనమైనది – అదనంగా మిగిలే పదార్థమే లేదు దానికి. అయినా శిష్టకృత్ ఏదో అదనంగా ఉన్నట్టు కల్పించి చూపుతుంది. అలా చూపుతున్నా దానివల్ల కలుషితం కాదు మరలా. అది వట్టి ఆభాసే గనుక శుచి, పరిశుద్ధమే.

**సిద్ధార్థః సిద్ధ సంకల్పః సిద్ధి దః సిద్ధి సాధనః** ప్రయోజనమూ దానికి సిద్ధమే. దాన్ని పొందే సంకల్పమూ సిద్ధమే, దానికి క్రొత్తగా పొందనక్కరలేదు. మరెవరికీ అక్కర. మనకు, మనం సాధన చేస్తే అది మనకు సిద్ధినిస్తుంది. ఆ సాధనం కూడా దాని జ్ఞానమే. దాని జ్ఞానంతో దాన్ని అందుకోవలసి ఉంది. ఆత్మనా విందతే వీర్యమ్.

**వృషాహీ వృషభః విష్ణుః** ఎలాగా ఆ అందుకోవటం, దాని అవరోహణ ముందు గమనించాలి. నామరూపాత్మకంగా తన తేజస్సును వర్షిస్తూ (వృష) దిగి వచ్చిందది (అహి) నామరూపాత్మకమైన దేహంగా

| | |
|---|---|
| వృషపర్వా<br>వృషోదరః | భాసించింది. (వృషభ) విష్ణు, జగత్తంతా ఆ చైతన్య దీప్తితో వ్యాపించింది. వృష పర్వ అంచెలంచెలుగా అనేక భూమికలలో ప్రసరించింది. ఇదంతా తన ఉదరంలో దాచుకొని అన్నింటి ఉదరంలో మరలా తాను ప్రవేశించింది. |
| వర్ధనః<br>వర్ధమానశ్చ<br>వివిక్తః<br>శ్రుతిసాగరః | వర్ధనమంటే కత్తిరించటం ఛేదించటమని కూడా అర్థమే. ఈ నామరూపాలను మరలా ఛేదించేది చైతన్యమే. ఛేదిస్తూ వర్థిల్లగలదు; వర్ధిల్లే కొద్దీ దీనినుంచి వివిక్త-వేరయి పోగలదు. అలా వేరవటం పూర్తి అయ్యేసరికీ నామరూపాత్మకమైన సంసారసాగరాన్నంతా తనలో చేర్చుకొని ప్రవిలయం చేయగలదు. ఇది ఆరోహణ. |
| సుభుజః<br>దుర్ధరః<br>వాగ్మీ | ప్రవిలయమైన ఈ జగత్తేమయింది. శక్తిరూపంగా మారుతుంది. అలాంటి స్వాభావికమైన తన శక్తినే తాను భుజిస్తాడా పరమాత్మ ఆయన శక్తిని ధరించవలసినదే. శక్తి ఆయనను ధరించలేదు. దుర్ధరుడాయన. పరావాక్కును వశీకరించుకొన్న వాగ్మి ఆయన. |
| మహేంద్రః<br>వసుదః<br>వసుః | తాను సృష్టించిన జగత్తును దీనికి మూలమైన శక్తిని మించి ఉండి దీనిని చూస్తున్నాడు. ఆ చూడటంద్వారా దీనికి వసు స్థితిని కల్పిస్తున్నాడు. ఆ మాటకు వస్తే ఆ కల్పించిన స్థితికూడా తానే. |
| నైకరూపః<br>బృహద్రూపః<br>శిపివిష్టః<br>ప్రకాశనః | ఏకరూపుడు కాడాయన. తన యోగమాయా బలంతో ఎన్ని రూపాలైనా ధరించి బృహద్రూపుడు కాగలడు. శిపి అంటే పశువులు లేదా ప్రాణులు. ఈ ప్రాణికోటి శరీరాలన్నింటిలో జీవరూపంగా విష్ట ప్రవేశించాడాయన. ప్రవేశించి చక్షురాదుల ద్వారా బయటపడి ప్రకాశిస్తున్నాడు. |

**ఓజస్తేజోద్యుతిధరః ప్రకాశాత్మా ప్రతాపనః** ఓజస్సు ప్రాణం, తేజస్సు బలం, ద్యుతి జ్ఞానం. జీవులకున్న ఈ గుణాలన్నీ వారివి గావు. 'బలం బలావతామస్మి తేజస్తేజస్వి నామహం' ఇవన్నీ ఆ భగవానుడివే. ఆయన చైతన్య ప్రకాశమే. ప్రకాశాత్ముడాయన. అది ప్రకాశమే కాక ఉష్ణంకూడా. ఈ ఉష్ణ ప్రకాశాలే తపిస్తూ నిలుపుతున్నాయీ బ్రహ్మాండాన్నీ పిండాండాన్నీ కూడా. ప్రకాశమంటే జ్ఞానం – ప్రతాపమంటే ప్రాణమని చెప్పినా చెప్పవచ్చు.

**ఋద్ధః స్పష్టాక్షరః మంత్రః** ఋద్ధమంటే సమృద్ధం. పుష్కలమని అర్థం. ప్రాణజ్ఞానద్యుతులు సమృద్ధంగా కలవాడాయన. తదనుగ్రహంవల్లనే మనకూ ఆ ప్రకాశమూ ప్రతాపమూ లభించి స్పష్టంగా పలకగలుగుతున్నాము. మనసుతో ఆలోచించ (మంత్ర) గలుగుతున్నాము. ఈ భాష భావం రెండుశక్తులూ అదే.

**చంద్రాంశుః భాస్కర ద్యుతిః** చంద్రుడంటే మనస్సు, భాస్కరుడంటే బుద్ధి, మన శరీరంలో మనోవృత్తులుగానూ (అంశు) బుద్ధి ప్రకాశంగానూ భాసిస్తున్నదదే. అలాగే ఈ విశ్వశరీరంలో చంద్రాదిత్య ప్రకాశాలు అదే.

**అమృతాం శూద్భవః భానుః శశిబిందుః సురేశ్వరః** అమృతమైన తన చైతన్యదీప్తిలో నుంచే తానుద్భవించాడు. భానురూపంగా, శశాంకరూపంగా, మనోబుద్ధి రూపంగా, ఇవి సురలుకావు. అంటే స్వతః ప్రకాశాలుకావు. తమేవభాంతమన్నట్టు దానిననుకరించి భాసిస్తున్నవే. వీటికీశ్వరుడాయన.

**ఔషధమ్ జగతః సేతుః సత్యధర్మ పరాక్రమః** ఈ మనోబుద్ధుల బలహీనతలను పోగొట్టి బలాన్ని ఇచ్చే గొప్ప దివ్యౌషధమాయన చైతన్యం. దాని నాశ్రయిస్తేనే ఈ జగత్తును దాటించే సేతువవుతుంది మనకు. దీని కావలితీరం సత్యమైతే ఈవలి తీరం ధర్మం. దానిని చేర్చే మార్గం. రెండు తీరాలనూ ఆక్రమించి ఉన్న దాతత్త్వం.

| | |
|---|---|
| **భూతభవ్యభవన్నాథః** | త్రికాలాలూ ఆ తత్త్వాన్ని మించి లేవు. వాటికదే నాథ |
| **పవనః** | న+అథ. దేని తరువాత మరొకటి లేదో అది నాథ. పవనః |
| **పావనః** | అది కదలకుండానే కదులుతుంది. పావన-కదిలించకుండానే |
| **అనలః** | కదిలిస్తుంది. అలమంటే ఇంత అని పరిమితి. అలాంటి పరిమితి లేనిది అనల పరిపూర్ణమని భావం. |
| **కామహా** | కదలాలంటే కోరిక ఉండాలి గదా. అలాంటికామమే లేదు |
| **కామకృత్** | దానికి. హా దాని నెప్పుడో వదిలేసింది. అసలులేదు. లేని |
| **కాంతః** | కామాన్ని కృత్ సృష్టించగలదు. సృష్టించి మరలా అంతమూ చేయగలదు. |
| **కామః** | కామమూ అదే, కామప్రదమూ అదే, కామాన్ ప్రకర్షేణ ద్యతి |
| **కామప్రదః** | ఛినత్తీతి - ఆకామాన్ని చివరకు త్రుంచి పారేసేదీ అదే. ప్రకర్షేణ |
| **ప్రభుః** | భవతి - మూడు రూపాలుగానూ ఉండగలదది. |
| **యుగాదికృత్** | యుగమంటే ద్వంద్వం. ఆది అంటే మొదట. ఈ ద్వందాల నన్నింటినీ సృష్టికి పూర్వం కల్పించిందీ అదే. మరేదీ గాదు. |
| **యుగావర్తః** | ఈ ద్వంద్వాలను సృష్టించి మరల వెనుకకు తీసుకొనేదీ అదే. |
| **నైకమాయః** | ఒకటిగాదు దాని మాయ. ఎంతైనా ఉంది. మీయతే అనయా- |
| **మహాశనః** | దానితో అన్నిటినీ కొలిచి పారేస్తుంది. మరలా అన్నిటినీ అశన - కబలించి వేస్తుంది. |
| **అదృశ్యః** | చిత్రమేమంటే తాను కనిపించకుండానే అన్ని పదార్థాలనూ |
| **వ్యక్తరూపశ్చ** | కనపడేలా చేస్తుంది మన దృష్టికి. |
| **సహస్రజిత్** | వేలూ లక్షలూ ఆ కనపడే రూపాలు, ఒక్కమాటలో అనంతం, |
| **అనంతజిత్** | అంతం లేదీ నామరూపాలకు. వీటికి తాను వశం కాదు. మరలా వీటినే జయించి వశంలో ఉంచుకొన్నాడు. |

**ఇష్టః అవిశిష్టః శిష్టేష్టః** జయించలేక వీటిచేత జితుడైనవాడు నరుడే. వీడిచేత మరలా ఇష్ట వెదకబడుతున్నాడా నారాయణుడు. అలాగని ఈ నరుడి కన్నా విశిష్టుడు కాడు. అవిశిష్టుడే, అభిన్నుడే. ఈ అభేదాన్ని గుర్తించిన శిష్టులే అలా వెదకి పట్టుకోగలరు.

**శిఖండీ నహుషః వృషః** పట్టుకొని దాన్నే ఒక కిరీటంగా (శిఖండ) ధరిస్తాడు శిష్టుడు. అలా ధరించమనే మౌనంగా మనకు బోధిస్తున్న దాతత్త్వం, అందుకోస మీ సంసారం తోడి తగులం నహి చేసుకొని నహుషుడవు కమ్మంటున్నది. వృష అప్పుడే నిజమైన సుఖాన్ని వర్షిస్తానంటున్నది కూడా.

**క్రోధహా క్రోధకృత్ కర్తా** అలాంటి ప్రయత్నం చేస్తూ పోతేనే జీవుడి మీద ఆగ్రహం చూపడు. క్రోధం వదిలేస్తాడు. లేకుంటే అంతా ఆగ్రహమే. అంతా మనమీద కోపమే. నిగ్రహానుగ్రహాలకు రెంటికీ కర్త ఆయన.

**విశ్వబాహుః మహీధరః** అంతా మనకివ్వగలడు. విశ్వబాహువులున్నాయాయనకు. ఎంత ఇచ్చినా ఇవ్వవచ్చు. లేదా ఆగ్రహిస్తే ఇవ్వకుండా వెనుకకు తీసుకోగలడా బాహువులు. అప్పుడవి మహీ శక్తిరూపంగా తానే ధరించి ఉంటాడు. వ్యక్తమై బయటపడదు.

**అచ్యుతః ప్రథితః** అసలది స్వరూపంగా అచ్యుతం. తన స్థానం నుంచి తానెప్పుడూచ్యుతి పొందలేదు. పొందకున్నా పొందినట్టు చేసినట్టు ఒక ప్రథ ఏర్పడిందాయనకు. దానితో ప్రథితుడయినాడు.

**ప్రాణః ప్రాణదః వాసవానుజః అపాం నిధిః** ఆయన చలిస్తే ప్రాణం. అది ఈ జీవుడి కందజేస్తే ప్రాణదుడు. ఈ జీవుడే శరీరంలో వసించే వాసవుడు. ఈ వాసవుణ్ణి అనుసరించి ఆయనా ఈ శరీరంలోనే జన్మించాడు. కాబట్టి

| | |
|---|---|
| **అధిష్ఠానమ్** | వాసవానుజుడు. జీవుడు చిదాభాసుడైతే ఆయన కూటస్థుడు. కనుకనే అది జన్మకాదు. అపాం పంచభూతాలకూ నిధి నిలయమైన వాడెలా జన్మిస్తాడు. జన్మించేది ఆరోపితమే అధిష్ఠానం కాదు. అధిష్ఠానం పరమాత్మ. |
| **అప్రమత్తః ప్రతిష్ఠితః** | ప్రమత్తత అంటే పరాకు. అది ఉన్నప్పుడే జన్మ. అది ఎప్పుడూ లేని అప్రమత్తుడాయన. తన ప్రజ్ఞానంలో తానెప్పుడూ ప్రతిష్ఠితుడే. |
| **స్కందః స్కందధరః** | స్కందుడంటే జారిపడినవాడు. ఈ జారిపడిన జీవుడెవడో కాదు మరలా. వీడిని ధరించిన స్కందధరు డాయనే. |
| **ధుర్యః** | ఈ జీవుణ్ణే కాదు. ఆ మాటకు వస్తే జగత్తును కూడా ధరించిన ధుర్యుడాయన. |
| **అవరదః** | అలా ధరిస్తూనే ఈ అవరమైన శరీరాదులు మనకిచ్చాడు. |
| **వాయువాహనః** | దీనిలో ఈ ప్రాణవాయువును ప్రవహింపజేశాడు. |
| **వాసుదేవః బృహద్భానుః** | ఈ దేహ ప్రాణాలేమిటో కావు మరలా. వాసుదేవుడనైన నేనేనంటాడు. వసతి దీవ్యతీతి వాసుదేవః – అస్తిభాతి ఉండటం ప్రకాశించటమే వాసుదేవ అంటే, ఉన్నది శరీర ప్రాణాలు. ప్రకాశిస్తున్నది లోపలి చైతన్యం. బృహత్ప్రకాశమది. |
| **ఆదిదేవః పురం దరః** | ఆదినుంచీ ఉన్నదా ప్రకాశం. పురందర త్రిపురాలనూ దారణం చేసే దీప్తి అది. త్రిపురాలేవో కావు స్థూల సూక్ష్మ కారణ శరీరాలే. |
| **అశోకః తారణః తారః** | తారణం చేస్తే కారణ శరీరమైన మోహశోకాలు పోతాయి ముందు. వాటితోపాటు పేకమేడలాగా మిగతావీ కూలి పోతాయి. అప్పుడీ జీవుణ్ణది తరింపజేస్తుంది. వీడు తరిస్తాడు. |

| | |
|---|---|
| **శూరః**<br>**శౌరిః**<br>**జనేశ్వరః** | పరమాత్మ నిత్యముక్తుడు కాబట్టి ఎప్పుడూ శూరుడే. ఆ శూరుడి వల్ల తరించాడు కాబట్టి జీవుడు శౌరి. కాగా ఇద్దరూ జనేశ్వరులే. జన్మ కతీతులే. |
| **అనుకూలః**<br>**శతావర్తః** | కూలాన్ని అనుసరిస్తూ తనలోనే శతావర్తాలు (సుళ్ళు) తిరుగుతున్న మహా చైతన్యసాగరమది. |
| **పద్మీ**<br>**పద్మనిభేక్షణః** | భూర్భువస్సు వరాదులైన పద్మాలే ఆవర్తాలు. అన్నీ ఆయన ధరించినవే. ధరించాడనేది కూడా ఒక నిభం, నెపం. అవి ఆయన ఈ క్షణం వల్ల ఏర్పడే ఆభాసలే. |
| **పద్మనాభః**<br>**అరవిందాక్షః**<br>**పద్మగర్భః**<br>**శరీరభృత్** | ఈ పద్మాలన్నీ అసలా చైతన్యంలోనే గుప్తమై ఉన్నాయి. అది నాభి వీటికి. దాని వీక్షణంవల్ల అరలరలుగా విందవిచ్చు కొన్నాయి. అలా విచ్చిన పద్మాల గర్భంలో తానే వచ్చి అంతర్యామి రూపంగా ప్రవేశించాడు. ప్రవేశించి శీర్ణమవుతున్న ఈ శరీర పద్మాలను విరిసిపోకుండా ధరించాడు. |
| **మహర్ధిః**<br>**ఋద్ధః**<br>**వృద్ధాత్మా** | ఋద్ధి అంటే సంపత్తి. ఇంతటి మహాసంపద ఉందా చైతన్యంలో దానితో అది ఎప్పుడూ సమృద్ధమే. అది ఇక వర్ధిల్లనక్కరలేదు. ఇతః పూర్వమే వృద్ధమయి ఉంది. |
| **మహాక్షః**<br>**గరుడధ్వజః** | అక్షమంటే ఇరుసు. అది ఒక పెద్ద ఇరుసు ఈ సంసార చక్రానికి. నిత్యమూ రాకపోకలు చేసే ఈ ప్రాణమనే గరుత్మంతుడే దానికి ధ్వజం. దాని ప్రభావాన్ని మనకు సూచించే సంకేతం. |
| **అతులః**<br>**శరభః**<br>**భీమః** | దానికి సూచకమైన ఈ కాలం కూడా దాన్ని తూకం వేయలేదు. తుల తూగనిదది. ఒక శరంలాగా ఈ కాలాన్నికూడా ఛేదించ గలదు. అతిభయంకరమైనదా తత్త్వం. |

| | |
|---|---|
| **సమయజ్ఞః** | సమయం తెలుసు దానికి. ప్రారబ్ధం తీరగానే ఈ ప్రాణాదిక |
| **హవిర్హరిః** | మంతటినీ ఒక హవిస్సులాగా హరించి వేస్తుంది. |
| **సర్వలక్షణ లక్షణ్యః** | అందుకే అది హరించే లోపల ఈ జీవుడు సర్వజగత్తునూ |
| **లక్ష్మీవాన్** | ఒక లక్షణంగా చేసుకొని దీనిద్వారా దాన్ని లక్షించగలగాలి. |
| **సమితింజయః** | అలా లక్షించినవాడే లక్ష్మీవాన్. వాడే ఈ సమితి సంసారమనే యుద్ధంలో జయాన్ని పొందుతాడు. |
| **విక్షరః** | క్షరణమంటే జారటం లేదా అపజయం. అది లేనివాడాయన. |
| **రోహితః** | కనుకనే ఆ లక్ష్యాన్ని పట్టుకొని అంతకంతకు రోహిస్తూ పోతే |
| **మార్గః** | మార్గమూ ఆయనే, గమ్యమూ ఆయనే, అవుతాడీ సాధకుడికి. |
| **హేతుః** | ఉపాదాన నిమిత్తాలు రెండూ పరమాత్మే. కాబట్టి భయంలేదు. |
| **దామోదరః** | దమాదులైన సాధన రహస్యాలన్నీ దాని గర్భంలోనే గుప్తమయి |
| **సహః** | ఉన్నాయి. కనుక సాధించవచ్చు. అయితే సహనంతో చేయాలి |
| **మహీధరః** | ప్రయాణం. చేసి గట్టెక్కితే ఆయనలాగా (మహీ) శక్తి ధరులమే |
| **మహాభాగః** | కావచ్చు. మహాభాగ-షాడ్గుణ్యమనే భగం కూడా వశమవు |
| **వేగవాన్** | తుంది మనకు. సంసారమనే ఈ ప్రవాహంలో ఉంటూనే |
| **అమితాశనః** | జీవుడిలాగా మితంగా కాక అమితంగా దీన్ని అనుభవించ వచ్చు. అనులోమ ప్రతిలోమాలు రెండూ అశనమే జీవన్ముక్తుడికి. |
| **ఉద్భవః** | జీవుడుగా ఉద్భవించిందీ అదే. సంసారక్షోభ పొందిందీ అదే. |
| **క్షోభణః** | |
| **దేవః** | జ్ఞానంతో నిత్యమూ ప్రకాశిస్తున్నదీ అదే. |
| **శ్రీగర్భః** | శ్రీ అంటే శక్తి - శక్తి రూపంగా ఈ జ్ఞేయ ప్రపంచాన్నంతా |
| **పరమేశ్వరః** | లోగొన్నదీ అదే. అన్నింటినీ అదుపులో ఉంచుకున్న ఈశ్వరుడూ అదే. |

| | |
|---|---|
| **కరణమ్**<br>**కారణమ్**<br>**కర్తా**<br>**వికర్తా** | ఒక కార్యానికి తోడ్పడే కరణమూ - దాని కుపాదానమైన కారణమూ దానికి నిమిత్తమైన కర్తా - దాన్ని ఎప్పటికప్పుడు మార్పు చెందించే వికర్తా అంతా అదే. మరేదీ కాదు. |
| **గహనః**<br>**గుహః** | అంతా అదే అయ్యేసరికి దాన్ని అర్థం చేసుకోవటం గహనమవు తున్నది. అంత గంభీరమైనదది (గుహ) |
| **వ్యవసాయః**<br>**వ్యవస్థానః**<br>**సంస్థానః** | అందుకోసం వ్యవసాయ-నిశ్చయాత్మకమైన బుద్ధి కావాలి. అది వ్యవస్థాన గట్టిగా నిలవాలి. సంస్థాన - చెదరకుండా ఒక్కచోట పుంజీకృతం కావాలి. అన్నిటినీ కలుపుకోవాలి. |
| **స్థానదః**<br>**ధ్రువః** | ఆసించిన స్థానం లేదా ఫలితాన్ని అందివ్వాలి. అది మరలా చలించకుండా ధ్రువమయి ఉండాలి. |
| **పరర్ధిః**<br>**పరమస్పష్టః** | అంత పుష్కలమైనదది. పరమ్+అస్పష్టమ్ అయినా అస్పష్టమే దాని స్వరూపం. ఆత్మరూపంగా భావిస్తే ఎంతో స్పష్టం. పరమ స్పష్టం. |
| **తుష్టః**<br>**పుష్టః**<br>**శుభేక్షణః** | స్పష్టమెప్పుడయిందో తుష్టీ పుష్టీ కూడా చేకూరుతుంది. అలాంటి శుభాన్ని మానవుడికందించే చూపుగలదా పరమాత్మ చైతన్యం. |
| **రామః**<br>**విరామః**<br>**విరతః** | జీవేశ్వర రూపంగా ఈ సంసారంలో రమించేది అదే, దీని నుంచి విరమించేది అదే. అసలు ఎప్పుడూ విరమించి ఉన్నదీ అదే. |
| **మార్గః**<br>**నేయః**<br>**నయః** | అలాంటి తత్త్వాన్ని చేర్చే మార్గమూ అదే. ఆ మార్గంలో కొనిపోబడే సాధకుడూ అదే, కొనిపోవటమదే, సాధకుడు కాకుంటే అలాంటి లౌకికుణ్ణి కొనిపోవనిదీ అదే, మన |

అనయః ప్రయత్నమే ఆయన అనుగ్రహం. అప్రయత్నమే ఆగ్రహం.

వీరః అనుగ్రహిస్తే వి+ఈర. విశేషంగా ఈరణ చేయగలడు. లేకుంటే
శక్తిమతాంశ్రేష్ఠః విరుద్ధంగా త్రోసివేయగలడు. శక్తిమంతులకంటే శక్తిమంతు
ధర్మః డందులో ధర్మమంటే సాధన. సాధనా-సాధన రహస్యం
ధర్మవిదుత్తమః తెలిసినవాడూ, ఉత్తమమైన సిద్ధీ మూడింటి స్వరూపమాయన.

వైకుంఠః వికుంఠః-ఏ మాత్రమూ కుంఠితం కాని దా స్థానం. అది
పురుషః పూర్ణం. పురుష అంటే పూర్ణమైనదనే అర్థం.

ప్రాణః ప్రాణ రూపం కూడా అదే. అది చలిస్తేనే ప్రాణమయింది.
ప్రాణదః మనకీ ప్రాణన శక్తిని ప్రసాదించింది అదే. ప్రణవనాద
ప్రణవః రూపంగా ఈ ఉపాధిలోకి దిగి వచ్చింది. ఘనీభవించి
పృథుః కళగాకూడా మారింది. అదే ఈ పృథివ్యాదికం.

హిరణ్యగర్భః అయినా కొఱతలేదు. హిరణ్య-చిత్ప్రకాశ గర్భితమైనదది. దాన్ని
శత్రుఘ్నః పట్టుకొంటే చాలు. ఉపాధులనే శత్రువులను సంహరిస్తుంది.

వ్యాప్తః దీని ఖాళీకూడా అదే వ్యాపించి ఉందసలు. సాధన చేస్తే మరలా
వాయుః వాయు - వ్యాపించినట్టు కనిపిస్తుంది. అప్పుడింద్రియ జ్ఞాన
అధోక్షజః (అక్షజ) మడుగంటి అతీంద్రియ జ్ఞానమలవడక తప్పదు.

ఋతుః ఋ అంటే దర్శనం. తద్బలంతో ద్రష్ట అవుతాడు సాధకుడు.

సుదర్శనః సుదర్శనం. సమీచీనమైన దర్శనమది. కలయతీతి కాలః సమస్త
కాలః సృష్టినీ కలనం చేసుకొంటాడు. అంటే తన స్వరూపంగా మార్చుకోగలడు.

పరమేష్ఠీ పరమమైన స్థానంలో ఉండిపోతాడు. అలా ఉండి చరాచర
పరిగ్రహః జగత్తునంతా అన్ని వైపులా (పరి) తన చైతన్యక్షేత్రంలోనే
పట్టుకొని (గ్రహ) ఉంటాడు.

| | |
|---|---|
| **ఉగ్రః** **సంవత్సరః** **దక్షః** **విశ్రామః** | ఉచ్చమైన స్థితి అది. సమస్తమూ అందులోనే చక్కగా వసిస్తున్నది. దక్ష - అందుకే సర్వసమర్థమైనది. అక్కడే విశ్రాంతి ఈ సాధకుడికి. శ్రాంతి లేనిదేదో అది విశ్రాంతి. శ్రాంతి ఈ సాంసారికమైన తాపత్రయమే. అది లేని స్థానం గనుక విశ్రామం. |
| **విశ్వదక్షిణః** | అయితే దాని నందుకోవాలంటే విశ్వంమీద భ్రాంతి ఉండ కూడదు. దీనినంతా దక్షిణగా సమర్పించాలి దానికి. |
| **విస్తారః** **స్థావర** **స్థాణుః** | ఆ విశ్రాంతికూడా ఎంతో విస్తీర్ణమైనది. ఎప్పుడూ సంకుచితం కాదు. స్థావరస్థ - స్థావరంగా ఉండే అణు - అణువది. అతి సూక్ష్మమైనది. |
| **ప్రమాణం** **బీజమ్** **అవ్యయమ్** | దానికేమిటి ప్రమాణమని ప్రశ్నలేదు. దానికదే ప్రమాణం. జ్ఞానం కనుక స్వతః ప్రమాణమది. మిగతా ప్రత్యక్షాది ప్రమాణాలకూ వాటికి గోచరించే ప్రమేయాలకూ బీజం ప్రవర్తకమది. అవ్యయం. తాను మారకుండా వీటి మార్పును గమనిస్తుంటుంది. |
| **అర్థః** **అనర్థః** | అర్థమూ అదే అనర్థమూ అదే. దాన్ని అర్థించే సాధకుల కర్థం. అర్థించని పామరుల పాలిటికదే అనర్థం. |
| **మహాకోశః** **మహాభోగః** **మహాధనః** | అది ఒక గొప్ప కోశం. నిధి. నిధిలాగే చాలా గుప్తంగా ఉన్నది. మహా+ఆ భోగ. చాలా విశాలమైనది. సమృద్ధమైనది. ఏ ధనమూ పనికిరాదు దాని దగ్గర. మహాధనం. ప్రపంచమంతా దాని ధనమే. |
| **అనిర్విణ్ణః** | అందుకే దానికి నిర్వేదం లేదు. ఎప్పుడూ తృప్తిగా ఉంటుంది. దానినందుకొంటే మనకూ తృప్తే. కాని విసుగు చెందరాదు సాధకుడు. అనిర్విణ్ణుడయి ఉండాలి. |

**స్థవిష్ఠః**
**అభూః**

అన్నిటికన్నా స్థూలమది. దానికన్నా స్థూలం అభూః - నభవతి లేదు. నిత్యసిద్ధమది. అభూః - క్రొత్తగా ఏర్పడేది కాదు.

**ధర్మయూపః**
**మహామఖః**
**నక్షత్రనేమిః**
**నక్షత్రీ**

ధర్మాచరణతో దాన్ని సాధించాలని చూస్తారు. పెద్ద పెద్ద మఖాలు రాజసూయాదియాగాలు చేస్తారు. నక్షత్ర దానివల్ల క్షతం తొలగి పోయిందని భావిస్తారు. కాని వాటన్నింటికీ నేమి - కేంద్రస్థానమా పరమాత్మేనని ఎరగరు. దాన్ని భావిస్తేనే క్షతానికి దూరమవుతామని కూడా తెలియరు.

**క్షమః**
**క్షామః**
**సమీహనః**

అన్నీ క్షపితమైనా నిలిచి ఉండేదది. కనుకనే మనలనూ నిలపగలదు. అలా నిలపాలని ఈహ కోరిక నీకు జనిస్తే దానికీ నిన్ను నిలిపే సంకల్పం కలిగి తీరుతుంది.

**యజ్ఞః**
**ఇజ్యః**
**మహేజ్యశ్చ**

అది వదిలేసి చేస్తున్నాము మనం యజ్ఞయాగాదులను. ఈ చేసే యజ్ఞస్వరూపుడా విష్ణువేనని తెలియదు మనకు. యజ్ఞో వైవిష్ణుః - అంతేగాదు. యజ్ఞంచేత ఇజ్యుడు యజింపవలసిన వాడూ ఆయనే. దేవతలు గదా ఇజ్యులంటే. వారికి కూడా ఇజ్యుడైన మహేజ్యుడాయన.

**క్రతుః**
**సత్రమ్**
**సతాం గతిః**

యజ్ఞాలే గాదు, సయూపాలైన క్రతువులూ ఆయనే. అవి చేయాలనే (క్రతు) సంకల్పమూ ఆయనే. దీర్ఘసత్రయాగాలూ ఆయనే. వీటన్నింటి ద్వారా శిష్టులైన పెద్దలందుకొనే గమ్యమూ ఆయనే.

**సర్వదర్శీ**
**విముక్తాత్మా**
**సర్వజ్ఞః**

ఇంతెందుకు. సర్వమూ అయి సర్వాన్నీ దర్శిస్తున్నాడా ఈశ్వరుడు. దర్శి గనుకనే దృశ్యంలో చేరిపోడు. దాని నుంచి ఎప్పుడూ విముక్తుడే. దృశ్యమైన సర్వమూ అసలు దృక్కే.

| | |
|---|---|
| **జ్ఞానముత్తమమ్** | జ్ఞానమే, దృశ్యరహితం గనుక ఆ జ్ఞానమెప్పుడూ ఉత్తమమే. అఖండమే. |
| **సువ్రతః**<br>**సుముఖః**<br>**సూక్ష్మః** | జ్ఞాన స్థితే వ్రతం దానికి. దాన్ని విడిచి ఉండదు. అదే ముఖం దానికి జ్ఞేయాన్ని దర్శించటానికి. జ్ఞానమే జ్ఞేయమయి ఈ జ్ఞేయాన్ని మరలా ఆ జ్ఞానమే దర్శిస్తున్నది. ఇదే అన్నింటికన్నా అతిసూక్ష్మమైన రహస్యం. |
| **సుఘోషః**<br>**సుఖదః**<br>**సుహృత్** | ఈ రహస్యాన్ని ఆగమరూపంగా ఘోషిస్తూనే ఉన్నదది. దాని నర్థం చేసుకొని పట్టుకొనే సాధకుడికది సుఖదమే, సుహృత్తే. |
| **మనోహరః**<br>**జితక్రోధః**<br>**వీరబాహుః**<br>**విదారణః** | సుహృత్తు గనుకనే మొదట సాధకుడి మనసును హరిస్తాడు. దానితో క్రోధమనేది తొలగిపోతుంది. క్రోధం రాగానికి కూడా ఉపలక్షణం గనుక రాగద్వేషాలు రెండూ పోతాయని భావం. తన్మూలంగా వీరబాహువయి విదారణ చేయగలడీ రజస్తమో గుణాలను. |
| **స్వాపనః**<br>**స్వవశః**<br>**వ్యాపీ** | స్వమ్ ఆపాదయతీతి స్వాపనః ఆవరణ విక్షేపరూపమైన ఆ రెండింటినీ విదారణ చేసి మన స్వరూపంలోనే నిలుపుతాడు మనలను. మన వశంలో ఉంటామప్పుడు మనం. లేదా ప్రపంచ వశంలో కాక పరమాత్మ వశంలో ఉంటాము. అదే వ్యాప్తి ఈ సాధకుడికి. జీవజగదీశ్వర భేదం నశిస్తేనే నిజమైన వ్యాప్తి. |
| **నైకాత్మా**<br>**నైకకర్మకృత్** | అలా వ్యాపిస్తే అన్ని దేహాలూ మనవే. ఆత్మ అంటే ఇక్కడ దేహమని అర్థం. అలాగే ఆ దేహాలతో చేసే అన్ని వ్యాపారాలూ మనవే. ఈశ్వర రూపంగా శరీరేంద్రియాదులన్నీ ఒక్కటే అయినప్పుడీ యజ్ఞయాగాదులెవరి కోసం. |

| | |
|---|---|
| **వత్సరః** | అన్ని రూపాలూ కర్మలూ అందులోనే వసిస్తున్నాయి. అన్నీ |
| **వత్సలః** | తనవే గనుక అందరికీ వత్సలుడాయన. అవిగాదు తనలో |
| **వత్సీ** | వసించటం. అసలు తనలో తానే (వత్సీ) వసిస్తున్నాడు. |
| **రత్నగర్భః** | అంతా స్వరూపమే కాబట్టి ప్రతి ఒక్కటీ విలువైన రత్నమే. |
| **ధనేశ్వరః** | అది ఆ చైతన్య గర్భంలోనే ఉంది. అమూల్యమైన ఆ |
| | ధనానికంతా అధిపతి అదే. |
| **ధర్మగుప్** | ఇంతకూ ధర్మమని నీవు భావించే దానినంతటినీ తనలో గుప్తం |
| **ధర్మకృత్** | చేసుకుంటాడు. తానే దానిని బయట పెడుతూ అది ఏదో |
| **ధర్మీ** | గాదు మరలా తన స్వరూపమే (ధర్మ) నని చాటుతుంటాడు. |
| | ధర్మి నీవూ నేనూ కాదు. పరమాత్మ. |
| **సత్** | అసలు దానికి వేరుగా ఏదీలేదు. ఉన్నదంతా అదే (సత్) |
| **అసత్** | లేనిదంతా కూడా అదే (అసత్) రజ్జుసర్పాలు రెండూ అదే. |
| **క్షరమ్** | అంతేకాదు. ఆభాస రూపంగా ఎప్పటికప్పుడు(క్షర) నశించేది |
| **అక్షరమ్** | అదే. వస్తురూపంగా (అక్షర) ఎప్పటికీ నశించనిదీ అదే. |
| **అవిజ్ఞాతా** | వివిధంగా విశేషంగా చూచే జ్ఞాత జీవుడు. ఇలాంటి జ్ఞాతకా |
| **సహస్రాంశుః** | డాయన సర్వజ్ఞుడు. తన చైతన్య మండలంనుంచి వెలువడిన |
| | సహస్రాంశువులే ఈ నామరూపాలు. |
| **విధాతా** | వివిధ రూపాలుగా వీటిని తీర్చిదిద్ది – ప్రత్యేకంగా వీటికాయా |
| **కృత లక్షణః** | లక్షణాలను కల్పించి వీటికి నియామకుడయి ఉన్నాడు. |
| **గభస్తినేమిః** | నామరూపాలనే ఈ దీప్తి కిరణాల కన్నింటికీనేమి – కేంద్రమది. |
| **సత్త్వస్థః** | కిరణచక్రమది. తన సత్త్వంలో తానుంటూ మరలా సత్త్వశుద్ధి |
| **సింహః** | మూలంగా భాసిస్తుంది. దానికి ప్రతిద్వంద్వి అయిన |

**భూతమహేశ్వరః** రజస్తమస్సులను సింహంలాగా హింసిస్తుంది. అప్పుడే సమస్త భూతాలకూ మహేశ్వరుడనిపించుకొంటాడు మానవుడు.

**ఆదిదేవః**
**మహాదేవః**
**దేవేశః**
**దేవభృద్గురుః**

దేవతలూ కొంత కొంత అధీశులే భూతజాతానికి, వారికి కూడా ఆది దేవుడు పరమాత్మ. మహాదేవ. అంతకన్నా పరిపూర్ణమైన దాయన దీప్తి. దేవతల దీప్తి శకలాలకన్నింటికీ అధీశ్వరమైన దీప్తి. దీప్తి కలిగిన వాటన్నింటికీ దీప్తి నొసగిన గురువది.

**ఉత్తరః**
**గోపతిః**
**గోప్తా**

నీవెంత గురువని చెప్పినా అంతకన్నా (ఉత్తర) గొప్ప గురువా పరమాత్మ, గో అంటే జ్ఞానం. సమస్త జ్ఞానాలకూ పతి - అతీతమైన జ్ఞానమది. ప్రజ్ఞానం బ్రహ్మ. దానినెప్పుడూ గోప్యంగా ఉంచుతాడు. బయటపెట్టడు.

**జ్ఞానగమ్యః**
**పురాతనః**

జ్ఞానమంటే ఇక్కడ బ్రహ్మజ్ఞానం. ఒక్క బ్రహ్మాకార వృత్తిచేతనే దాని నందుకోవలసి ఉంది. క్రొత్తగా ఏర్పడేది కాదు మరలా. అందుకోక పూర్వమే ఉందది. కేవల మావరణ భంగమే అందుకోవటం.

**శరీరభూతభృత్**
**భోక్తా కపీంద్రః**
**భూరిదక్షిణః**

పురాతనమైన ఆ చైతన్యమే ఒక వ్యష్టి శరీరాన్ని - సమష్టి శరీరాన్ని రెంటినీ ధరించింది. రెండూ పంచభూతాత్మకమే. రెండింటి లోనూ చేరి శబ్దాది విషయాలను భుజించే భోక్త కూడా తానే. కమ్ పిబ తీతి కపి, సూర్యుడు. అంటే బుద్ధి. దీనికింద్రుడు సాక్షిగా ఉన్నది తానే. ఆ సాక్షిని నీ బుద్ధి పట్టుకోవాలంటే భూరి ఈ ఉపాధి వర్గాన్నంతా (దక్షిణ) త్యాగం చేయాలి. త్యాగేనైకే అమృతత్వమానశుః

**సోమపః**
**అమృతపః**
**సోమః**

సోమ అంటే చంద్రుడు, చంద్రుడంటే మనస్సు, అమృతమంటే అవ్యక్తం లేదా మాయ. ఆ రెండింటినీ ప అంటే కబళించిన వాడు, కబళించి స+ఉమా సోమ. నిత్యమైన తన చైతన్య శక్తితో నిలిచి ఉంటాడు.

**పురుజిత్**
**పురుసత్తమః**

పురు అంటే సర్వం. సర్వమూ జయించి సర్వమూ సత్తా రూపంగా ధరించి ఉంటాడా ఈశ్వరుడు.

**వినయః**
**జయః**

వినయమంటే శిక్షణ. ఇలాంటి ఆధ్యాత్మికమైన శిక్షణనే అవలంబించి జయాన్ని పడయమని సాధకులకు బోధిస్తున్నాడు.

**సత్యసంధః**

అలాంటి వినీతులకు సత్యమైన తన స్వరూపాన్ని సంధిస్తాడు. అలా సంధించటం సత్యమేనని (సంధ) ప్రతిజ్ఞ చేసి చెబుతున్నాడు.

**దాశార్హః**
**సాత్వతాం పతిః**

దాశమంటే దాస్యం కావచ్చు. దానం కావచ్చు. మన సర్వస్వ దానమే తనకు చేసే కైంకర్యమంటున్నాడు. సత్త్వగుణ సంపన్నులైన సాత్వతులే అలా చేయగలరు. వారి నెప్పుడూ పాలిస్తూనే ఉంటాడాయన.

**జీవః**
**వినయితా సాక్షీ**

అసలీ జీవులలో ఉన్న జీవ లక్షణమాయనే. క్షేత్రాలలో క్షేత్రజ్ఞుడుగా ప్రవేశించి వినయితా-వివిధ మార్గాలలో నడుపుతూ మరలా ఈ జీవులకు సాక్షిగా నిలిచి ఉన్నాడు.

**ముకుందః**
**అమిత విక్రమః**

ఆ సాక్షిని పట్టుకొంటే చాలు. ముకుం-ముక్తిని, ద- ప్రసాదిస్తాడు. అమిత విక్రముడాయన. కనుకనే ఈ జీవుల మితమైన విషమమైన క్రమాన్ని పోగొట్టగలడు.

**అంభోనిధిః**
**అనంతాత్మా**

అంభస్సంటే భూత పంచకం. దానికి నిధానం. ఆస్పదమాయన అనంతమంటే ఆకాశం. ఆకాశమే శరీరమాయనకు.

**మహోదధిశయః** మహోదధి గంభీరమైన యోగమాయే. దాని నధిశయించిన
**అంతకః** తత్త్వమది. దానికి కూడా అంతం. అవధి భూతమది.

**అజః** జన్మించకనే మహార్హా-విలువైన పదార్థమది. దానికి వెలగట్టే
**మహార్హః** వస్తువు మరొకటి లేదు గదా. స్వాభావ్య-తనపాటికి తాను
**స్వాభావ్యః** స్వభావ సిద్ధంగా ఉన్నదది.
**జితామిత్రః** తన పాటికి తానున్నది గనుకనే విజాతీయమైన శత్రువర్గం లేదు
**ప్రమోదనః** దానికి. అంటు సొంటులను జయించినది. అందుకే నిత్యప్రమోద శీలం.

**ఆనందః** ఆనందరూపమే అది. తన ఆనందాన్నే ముక్తుల కందజేస్తుంది.
**నందనః** సిద్ధులకు తప్ప బద్ధులైన వారికందదా ఆనందం. వారి
**అనందః** పాలిటికది అనందం.

**సత్యధర్మా** అది తాను ఉంటూ తతిమా వాటినన్నిటినీ ధర్మ - ధరించి
**త్రివిక్రమః** ఉన్నది. దేశకాల వస్తువులను మూడింటినీ (త్రి) విశేషంగా (వి) ఆక్రమించి (క్రమ) ఉన్నది.

**మహర్షిః** తన చైతన్య దర్పణంలోనే సమస్తమూ (ఋషి) చూస్తున్నది.
**కపిలాచార్యః** కపిలుడనే మహర్షిగా అవతరించి ముముక్షువులకు జ్ఞానోపదేశం చేసింది. సగరపుత్త్రులను దగ్ధం చేసిన అవతారమిది. సాంఖ్యమత ప్రవర్తకుడు కాదు.

**కృతజ్ఞః** స్వకృతమైన సృష్టినంతా గమనిస్తున్నది. మేదినీ-వైఖరీ
**మేదినీపతిః** రూపంగా వ్యాపించిన మాయాశక్తిని పాలిస్తున్నది.

**త్రిపదః** స్థూల సూక్ష్మ కారణ ప్రపంచాలనే మూడుస్థానాలు కలిగి
**త్రిదశాధ్యక్షః** జాగ్రదాదులైన మూడు దశలకూ సాక్షి అయి ఉన్నది.

**మహాశృంగః** వాటికి కూడా అతీతమైన తురీయమనే శృంగంలో మెలగుతూ-
**కృతాంతకృత్** కృతమైన ఈ మొత్తానికి, అంతకృత్ - అంతం చేస్తున్నదదే.

**మహావరాహః** అలాంటి పరమాత్మే మహావరాహమై గోవిందః ఈ పృథివితో
**గోవిందః** సాంగత్యం పెట్టుకొని సుషేణ-చరాచరాలనే పెద్ద సైన్యాన్ని
**సుషేణః** కని కనకాంగదీ, నామరూపాలనే ఈ కనకమే అంగద
**కనకాంగదీ** ఆభరణాలుగా ధరించాడు. హిరణ్యగర్భుడే మహావరాహం.

**గుహ్యః** ఈ ప్రవర్తనే ఎవరికీ అంతుపట్టదు. గోప్యమది. చాలా
**గభీరః** లోతైనది. అంభోనిధి అని గదా నామం, అంభోనిధి గనుకనే
**గహనః** గంభీరం. అంత గంభీరమైనదెప్పుడూ గహనమే. మనసుకు
కూడా అతీతం. అచింత్యం.

**గుప్తః** అంత గుప్తమైనదా పరమార్థం. చక్రంలాగా తిరుగుతోంది
**చక్రగదా ధరః** మానవుడి మనసు. గదా అంటే చెప్పే మాట. ఆలోచించే
మనసు ఆడుకొనే మాట రెండూ ఆయన చేతిలోనివే.

**వేధాః** మనమేది చేయాలన్నా ఆయనే విధించాలది. ఆయన తాలుకు
**స్వాంగః** అంగమే ఈ మానవుడు. అంగి ఆయన, అంగం మనం, అంగ
**అజితః** మెప్పుడూ అంగిని అతిక్రమించి పోలేదు. దీనిచేత జితం
**కృష్ణః** కాదది. మీదు మిక్కిలి అదే దీన్ని ఇటూ అటూ లాగగలదు
(కృష్ణ).

**దృఢః** దృఢంగా లాగగలదు. అటుగాని ఇటుగాని, సాధకులకైతే
**సంకర్షణః** సంకర్షణుడు. తనవైపే చక్కగా లాగుకొంటాడు. అలా లాగు
**అచ్యుతః** కొంటే ఇక ఆయనకు లాగా మనకూ చ్యుతిలేదు అచ్యుతులమే.

**వరుణః** సాధకులకు కావలసినదంతా వర్షిస్తాడు (వరుణ) మార్గంలో
**వారుణః** అంత రాయాలేవి వచ్చినా వారిస్తాడు. (వారుణ) తాపత్రయాన్ని

| | |
|---|---|
| **వృక్షః** | ఛేదిస్తాడు (వృక్ష-వ్రశ్చనాత్) తన స్వరూపంతో ఆవరిస్తాడు (వృక్ష-సంవరణాత్) |
| **పుష్కరాక్షః**<br>**మహామనాః** | పుష్కరమంటే ఆకాశం. ఆకాశమంత చూపు. అనంతమైన సంకల్పమూ కలవాడాయన. |
| **భగవాన్**<br>**భగహా** | జ్ఞానైశ్వర్యాదులూ, ప్రవృత్తి నివృత్త్యాదులూ (భగ) పరిపూర్ణంగా ఉన్నవాడేది చేయరాదు. మనకున్న (భగ-భాగ) జీవభావం (హా) పోగొట్టటంలోనూ ఆశ్చర్యం లేదు. |
| **నందీ**<br>**వనమాలీ**<br>**హలాయుధః**<br>**ఆదిత్యః**<br>**జ్యోతిరాదిత్యః**<br>**సహిష్ణుః**<br>**గతిసత్తమః** | జీవభావం పోతే అంతా నందమే ఆనందమే. సంసారమనే వనమాలా మనదే. దాన్ని ఒక పొలంలాగా దున్ని వేసే హలాయుధమూ మనదే. రెండూ మనకధీనమే. హలాయుధు డసలు పరమాత్మ. జ్ఞానలాంగలంతో జ్ఞేయక్షేత్రాన్ని దున్నుతూనే ఉంటాడు. సంసార సాగరాన్ని పీల్చివేసే ఆదిత్యుడూ (ఆదత్తే ఇతి) ఆయనే. తమస్సుకు పరమైన జ్యోతి అది. అన్నింటినీ సహించగలదది. అంతకు మించి మరొకటి లేదు గమ్యం జీవులకు. గతులన్నింటికీ పరాగతి అది. |
| **సుధన్వా**<br>**ఖండపరశుః** | ధనుర్ధరుడైన రాముడూ ఆయనే. పరశురాముడూ ఆయనే వేరుకాదు. |
| **దారుణః**<br>**ద్రవిణప్రదః** | అసుర దారణుడయి కశ్యపాదులకు ద్రవ్యాన్ని దానం చేసిన వాడూ ఆయనే. ఆ మాటకు వస్తే ధనుస్సు శరీరమే. ఖండపరశువు మనస్సే. దారుణం అన్నిటినీ చొచ్చుకొని పోయే ఇంద్రియాలు. పోతే ద్రవిణం శబ్దాది విషయజాతం. ఇవి ఇచ్చేవాడు (ప్రదదాతీతి) త్రోసి పుచ్చేవాడూ (ప్రద్యతి) ఆ పరమాత్మేనని తాత్పర్యం. |

| | |
|---|---|
| **దివిస్స్పృక్ సర్వదృగ్వ్యాసః వాచస్పతిః అయోనిజః** | దహరాకాశ పరాకాశాలను రెంటినీ స్పృశిస్తూ - సర్వమూ దృక్కే అయి (వ్యాస) వ్యాపించిన తత్త్వమది. సర్వాన్నీ కల్పించే పరాశక్తి (వాచః) కే అధిపతి. అలాటి దాని జన్మకేది యోని. అందుకే అయోనిజం-అజమది. |
| **త్రిసామా సామగః సామ** | జీవ జగదీశ్వర తత్త్వాలు మూడింటి సామ్యస్వభావమది. మూడింటి లోపలా బయటా పరచుకొని ఉన్నది. మూడు లేవసలు. వాటిని వ్యాపించటమూ లేదు. సర్వసమానంగా ఉన్నదది ఒక్కటే. |
| **నిర్వాణమ్ భేషజమ్ భిషక్** | అన్ని తాపాలకూ ఉపశమనమది. గొప్ప దివ్యౌషధం. అది పడితే చాలు త్రివిధ తాపాలకూ జవాబు చెబుతుంది. ఆ ఔషధం ప్రసాదించే వైద్యుడు కూడా అదే. |
| **సన్న్యాసకృత్ శమః శాంతః** | విజాతీయమైనదంతా త్యజించినదది. త్యజించి దానినంతటినీ తనలోనే లయింపజేసినది. చేసి ఎలాంటి వికారమూ లేక అచలంగా నిలిచిపోయినది. |
| **నిష్ఠా శాంతిః పరాయణమ్** | అలాంటి స్థితే కట్ట కడపటిది. అదే మీ మా శాంతి. అదే ఎప్పటికైనా మీరందుకోవలసిన పరమమైన గమ్యమని సాధకులకు బోధిస్తున్నది. |
| **శుభాంగః శాంతిదః స్రష్టా** | మోక్షమనే గొప్ప శుభాన్ని వారికంటిస్తుంది. (అంగ) అశాంతిని తొలగించి శాంతిని ప్రసాదిస్తుంది. దానికి వ్యతిరిక్తమైన తగుల మంతటినీ వదిలిస్తుంది. |
| **కుముదః కువలేశయః** | వదిలించేవారికి వదిలిస్తూ మిగతా వారినీ సాంసారికమైన కుమోదంలోనే పడదోస్తుంది. అది అనుభవించటానికి జీవ రూపంగా తానే వచ్చి ఈ (కువల) దేహచక్రంలో శయనిస్తాడా |

| | |
|---|---|
| | పరమాత్మ. మన ఈ దేహమే కాదు. బాహ్యమైన జగచ్చక్రం కూడా కువలమే. ఇందులోనే అంతర్యామి రూపంగా వచ్చి కూచున్నాడు. |
| **గోహితః**<br>**గోపతిః**<br>**గోప్తా** | పార్థివమైన తత్త్వంలో నిహితుడయి ఉన్నది తానే. దానికి మరలా పాలకుడయినదీ తానే. అయినా బయటపడకుండా తన అసలైన రూపాన్ని గోపనం చేసుకొంటూ ఉంటాడు. |
| **వృషభాక్షః**<br>**వృష ప్రియః** | ధర్మదృష్టితో మానవులను చూస్తూ వారు ధర్మం చేస్తుంటే ప్రీతి పొందుతుంటాడు. |
| **అనివర్తీ**<br>**నివృత్తాత్మా** | ధర్మానుష్ఠాన ఫలాన్ని అందజేయటంలో వెనక్కు తగ్గడు. తన స్వరూపం చూపకుండా ఎప్పుడూ వెనక్కు తిరిగే ఉంటాడు. |
| **సంక్షేప్తా**<br>**క్షేమకృత్**<br>**శివః** | ధర్మసాధకులు గాక మోక్షసాధకులనైతే వారి జీవభావాన్ని తనలో సంక్షిప్తం చేసి బ్రహ్మ భావాన్ని వారికి తొలగకుండా కాపాడుతూ (క్షేమకృత్) నిత్యశివమైన సాయుజ్యసుఖాన్ని వారికి ప్రసాదిస్తాడు. |
| **శ్రీవత్సవక్షాః**<br>**శ్రీవాసః**<br>**శ్రీపతిః**<br>**శ్రీమతాం వరః** | అలాంటి శివమైన శ్రీ (శక్తి) నిరంతరమూ తన (వక్ష) హృదయంలో నిలుపుకొన్నవాడు, తన మాయాశక్తికి తానే నివాసమైనవాడు. దాని కధిపతి తానే. మిగతా శక్తిమంతులని చెప్పబడే దేవతలందరిలో (వర) శ్రేష్ఠుడాయన. వారందరికీ (వర) శ్రేష్ఠుడాయన. వారందరికీ (వర) వరణీయుడు కూడా. |
| **శ్రీదః**<br>**శ్రీశః**<br>**శ్రీనివాసః** | ఏ సాధకుడికేది కావలిస్తే అది ఇస్తాడు. దానికి సమర్థుడు. సర్వశక్తులకూ నివాసం – నిలయమైనవాడు. వాటిని మనలో (నిధి) నింపగలవాడు. వివిధ రూపాలలో శక్తినావిష్కరించి |

| | |
|---|---|
| **శ్రీనిధిః** | చూపగలవాడు. విశేషంగా భావన చేసే కొద్దీ వాటిని మనకు |
| **శ్రీవిభావనః** | ప్రసాదిస్తాడు. |
| **శ్రీధరః** | సర్వశక్తులూ నిత్యమూ ధరించినవాడూ, మనలను ధరింపజేయ |
| **శ్రీకరః** | గలవాడూ అందుకోస మాశ్రయించవలసిన వాడూ ఆశ్రయిస్తే |
| **శ్రేయః** | శ్రేయోదాయకుడైనవాడూ ఆ పరమాత్మ. |
| **శ్రీమాన్ లోకత్రయా శ్రయః** | శ్రీమంతుడూ ఆయనే. శ్రీ వివర్తమైన లోకత్రయానికీ అధిష్ఠాన మైన వాడూ మరలా ఆయనే. ఆరోపితమూ అధిష్ఠానమూ రెండూ పరమాత్మేనని భావం. |
| **స్వక్షః** | సు+అక్ష-సకలేంద్రియ సౌష్ఠవమూ చైతన్య ప్రభావమే. |
| **స్వంగః** | సర్వావయవ (సు+అంగ) సౌష్ఠవమూ దాని ప్రభావమే. |
| **శతానందః** | శతవిధాల మనసుకు కలిగే ఆనందమూ తత్ప్రభావమే. కాగా |
| **నందీ** | దానిననుభవించి ఆనందించే జీవతత్త్వమూ అదే. |
| **జ్యోతిర్గణేశ్వరః** | ప్రకాశశీలమైన ఇంద్రియ వర్గానికీ ఆధిదైవికమైన జ్యోతిర్గణానికీ కూడా ప్రకాశకుడైనవాడు పరమాత్మ. |
| **విజితాత్మా** | దేనిచేతా పరాజితం కాకుండా అన్నిటినీ తనకు విధేయం |
| **విధేయాత్మా** | చేసుకొని పాలించే సచ్చిత్స్వరూపుడాయన. |
| **సత్కీర్తిః** | సద్రూపమైన ప్రకాశమది. అందుకే దాని నాశ్రయిస్తే ఎలాంటి |
| **ఛిన్న సంశయః** | సంశయాలైనా విచ్ఛిన్నం కావలసిందే జీవులకు. |
| **ఉదీర్ణః** | సంశయస్థానమైన సంసారాన్ని మించి (ఉత్-ఈర్ణ) పైకి లేచిన |
| **సర్వతశ్చక్షుః** | దాతత్త్వం. అంటకుండా అన్నివైపులా చూస్తున్నదీ సంసారాన్ని, |
| **అనీశః** | దాన్ని చూచే సామర్థ్యం దేనికీ లేదు. అది ఎప్పటికీ నిలిచి |
| **శాశ్వతస్థిరః** | ఉండేదా చూపు. |

భూశయః	పుట్టినవన్నీ అందులోనే ఉన్నాయి (శయ) అందులోనే (సన)
భూషణః	ఫలిస్తున్నాయి. (భూతి) అదే అయి ఉన్నాయి. ఈ రూపాలలో
భూతిః	కనిపిస్తున్నదదే.

విశోకః	అంచేత దానికీ శోకం లేదు. తద్రూపమే అయిన ఈ భూత
శోకనాశనః	జాతానికీ లేదు. తత్సాంగత్యం వల్ల నశింపజేస్తుంది.

అర్చిష్మాన్	చిద్దీప్తి గలదది. కనుక చిద్వృత్తి చేతనే అర్చించవలసినది.
అర్చితః	చిత్తునే తనలో కుంభించినది. అదే మనలోనూ కుంభింప
కుంభః	చేయగలిగినది.

విశుద్ధాత్మా	తత్పదార్థంగా అది ఎప్పుడూ శుద్ధమైనది. త్వంపదార్థమైన
విశోధనః	మనలనూ శుద్ధి చేయగలదు.

అనిరుద్ధః	సజాతీయం చేత నిరుద్ధం కాదది. విజాతీయం చేతా కానిదే.
అప్రతిరథః	ద్యుమ్నమంటే దీప్తి. ప్రకృష్టమైన చైతన్య దీప్తి అది. వి అంటే
ప్రద్యుమ్నః	ఆకాశం., అనంతమైన ఆకాశాన్ని తనదీప్తితో ఆక్రమించినది.
అమితవిక్రమః	అదే చిదాకాశం.

కాలనేమినిహా	కాలమనే చక్రాన్ని విరిచి పారవేసింది. వి+ఈర - ఈరణం
వీరః	అంటే చలనం, ఏ మాత్రమూ లేనిది. చలనమే గదా కాలం.
దాన్ని నిర్మూలించిందంటే అచలమే అది.

శౌరిః	జ్ఞానశూరుడైన పరమాత్మే శౌరి. అలాంటి శూరులైన జ్ఞాను
శూరజనేశ్వరః	లందరికీ ఈశ్వర - నాయకుడాయన.

త్రిలోకాత్మా	నిర్గుణమే సగుణమయి త్రిలోకాలకూ (ఆత్మ) స్వరూప
త్రిలోకేశః	మయింది. వాటికి నియామకమయింది. క+అ+ఈశ - బ్రహ్మ
కేశవః	విష్ణు మహేశ్వర రూపాలలో కనిపిస్తున్నది. కేశ-కిరణాలుగా

| | |
|---|---|
| కేశిహా | ప్రసరింపజేసింది. మరలా ఆ మూర్తిత్రయాన్ని సంహరించి |
| హరిః | సర్వహరమని ప్రసిద్ధి గాంచింది. |
| | |
| కామదేవః | (కామ) ఇచ్ఛాశక్తితో క్రీడిస్తాడాయన. దానిని పాలిస్తాడు అసలిచ్ఛా |
| కామపాలః | స్వరూపుడే అయి ఉన్నాడు. (క+అంతః) ఇచ్ఛనెప్పటి కప్పుడంత |
| కామీ | మొందిస్తుంటాడు. ఆ ఇచ్ఛతోనే మరలా అప్పుడప్పుడవతరి |
| కాంతః | స్తుంటాడు (ఆగమ). జీవుడుగా – ఈశ్వరుడుగా. |
| కృతాగమః | |
| | |
| అనిర్దేశ్యవపుః | ఇలాంటి స్వరూపమని నిర్దేశించలేము. సర్వమూ వ్యాపించి |
| విష్ణుః వీరః | సర్వమూ తానే అయి కూచున్నది. వి+ఈర – చలనమే లేనిది. |
| అనంతః | అంతులేనిది. దాని కంతం చెప్పాలంటే విజాతీయమైనది |
| ధనంజయః | చూపగలగాలి. అది ఈ జ్ఞేయ ప్రపంచమే. ఈ ధనమంతా |
| | దానిదే. అదే. |
| | |
| బ్రహ్మణ్యః | బ్రహ్మ అంటే తపస్సు–బ్రహ్మ అంటే వేదం. గొప్పతపస్సు (ఆలోచన) |
| బ్రహ్మకృత్ | చేసి వేదవిద్యను సృష్టించాడు. |
| బ్రహ్మా | అది బ్రహ్మదేవుడికి బోధించాడు. |
| | |
| బ్రహ్మ | వేద స్వరూపుడే తాను. వేదమంటే జ్ఞానం. దానినే మానవలోకంలో |
| బ్రహ్మవివర్ధనః | విశేషంగా వర్ధిల్ల జేస్తున్నాడు. |
| | |
| బ్రహ్మవిద్ | దాని మర్మం తెలిసినవాడూ తానే. దానికి సంబంధించిన |
| బ్రాహ్మణః | హక్కు హక్కుదారుడూ తానే. అది తనకంటే వేరుగా లేనివాడూ |
| బ్రహ్మీ | తానే. |
| | |
| బ్రహ్మజ్ఞః | బ్రహ్మ అంటే యోగం. దాన్ని ఛేదించి పట్టుకొనే మార్గం తెలిసిన |
| బ్రాహ్మణప్రియః | బ్రాహ్మణులంటే ఇష్టపడేవాడూ తానే. |

**మహాక్రమః**
**మహాకర్మా**
**మహాతేజాః**
**మహోరగః**
**మహాక్రతుః**
**మహాయజ్వా**
**మహాయజ్ఞః**
**మహాహవిః**

దేశకాల వస్తువులు మూడూ ఆక్రమించిన వాడు. బ్రహ్మాండాన్నే సృష్టించినవాడు. దాన్ని తన చైతన్యతేజంతోనే వెలిగిస్తున్నవాడు. ఉరగ-కుండలిని ప్రాణశక్తి. దానికంతటికీ ప్రాణస్థానమైనవాడు పరమాత్మ. అది తనలోనే ప్రవేశించి (క్రమ) తనద్వారానే పనులు చేయిస్తూ (కర్మ) తనలోనే జీవిస్తూ ఉందనే (ఉరగ) నిశ్చయ జ్ఞానంతో (క్రతు) యజమానుడయి (యజ్వా) జీవితమే యజ్ఞమని భావించి తన దనేదంతా ఆ జ్ఞాన యజ్ఞంలో హోమం (హవిః) చేయటమే సాధన.

**స్తవ్యః**
**స్తవప్రియః**
**స్తోత్రమ్**

సాధకుడు స్తుతింపవలసినదీ-స్తుతి అంటే సుముఖత చూపేదీ-స్తుతించే సామగ్రీ - స్తుతించే ప్రకారమూ, స్తుతి.

**స్తుతిః**
**స్తోతా**

అసలీ స్తుతి చేసే సాధకుడూ (స్తోతా) ఈ వాగ్వ్యాపారమంతా ఆ చైతన్య విభూతే. దాని పరిధిలో జరుగుతున్నదే ఇదంతా.

**రణప్రియః**

రణనమంటే నాదం. అదంటే ఇష్టపడేదా తత్త్వం. అప్పటికి బ్రహ్మ, యజ్ఞ, స్తవ (రణ) ఇవి మూడూ మన మనోవాక్కాయా లనే త్రికరణాలకూ సంకేతం. ఈ కలాపమంతా ఆ పరమాత్మే అన్నప్పుడిక వీటిద్వారా సాధించవలసిన ఏకైక గమ్యమదేనని చెప్పినట్టయింది.

**పూర్ణః**
**పూరయితా**

అది ఎప్పుడూ పూర్ణస్వరూపమే. కనుక ఈ సాధకుడికి కూడా ఆ పూర్ణత్వాన్ని ప్రసాదిస్తాడు. (పూరయితా)

**పుణ్యః**
**పుణ్యకీర్తిః**

తద్వారా వీడికి పట్టిన అవిద్యా మాలిన్యం క్షాళితమయి (పుణ్య) శుద్ధి అవుతాడు. విద్యావంతుడనే కీర్తి గడిస్తాడు. సంసారమనే

**అనామయః** (ఆమయం) వ్యాధి తొలగిపోయి స్వస్థత చేకూరుతుంది.

**మనోజవః** మనోవేగంతో పట్టుకోవాలి సాధకుడు దాన్ని. అప్పుడే వాణ్ణి
**తీర్థకరః** తీర్ణుణ్ణి చేస్తుందది. మంచి వీర్యాన్ని ప్రసాదిస్తుంది.
**వసురేతాః** రేతస్సంటే వీర్యమనే అర్థం. ఆత్మజ్ఞతే వీర్యం.
**వసుప్రదః** అది సంక్రమించిన వాడి కిహంలో భోగమూ ఇస్తుందది.
**వసుప్రదః** పరంలో మోక్షమూ ఇస్తుంది.

**వాసుదేవః** వసతి–దీవ్యతి, సచ్చిదాత్మకమైన తత్త్వమది. అదే ప్రపంచ
**వసుః** మంతటా (వసు) వసిస్తున్నది. మానవుడి మనసులోనూ అదే.
**వసుమనాః** ఎటు వచ్చీ ఈ సచ్చి ద్విశేషరూపంగా కనిపించే సృష్టినంతా
**హవిః** దానిలో హోమం చేయగలగాలి మనం.

**సద్గతిః** సత్సామాన్యమే సద్విశేషాలన్నింటికీ గతి - సముద్రం
**సత్కృతిః** తరంగాదులకు లాగా మరలా సముద్రమే తరంగ రూపంగా
మారినట్టు ఆ సామాన్యమే విశేషసృష్టి చేస్తున్నది.

**సత్తా** అలా చేస్తున్నా మరలా అది సత్తా రూపమే. అంతకన్నా విశేష
**సద్భూతిః** మేమీ లేదు. విశేషంగా కనిపించేదంతా ఆ సద్విభూతే, అది
**సత్పరాయణః** దానికి పరాయణం. లయ స్థానం.

**శూరసేనః** శూరుని వంశంలో పుట్టి యదుశ్రేష్ఠుడైన కృష్ణుడదే. సాధకులే
**యదుశ్రేష్ఠః** ఆయన సేన. వాడే శూరసేనుడు. యదు శ్రేష్ఠ - ఏదేది
**సన్నివాసః** శ్రేష్ఠమంటున్నామో దానికంతటికీ శ్రేష్ఠమని అర్థం. సత్ -
**సుయామునః** వివేకవంతులే దానికి నివాసం. (యమ–జంట) జీవేశ్వరులనే
(యమున) జంటలో (సు) శ్రేష్ఠమైన ఈశ్వర తత్త్వమది.

**భూతావాసః** చరాచరభూతాలూ ఆ వాసమే – భూతాలకూ అది ఆవాసమే.
**వాసుదేవః** ఎప్పుడూ ఆరని (వాసు) తేజస్సది (దేవ). అందరిలో ప్రాణశక్తి
**సర్వాసునిలయః** (అసు) రూపంలో లీనమయి (నిలయ) ఉన్నది.

| | |
|---|---|
| **అనలః** | (న+అలమ్ యస్య స అనలః) పరిమాణమింత ఉందని ఇంతవరకని చెప్పలేనిదది. |
| **దర్పహా దర్పదః దృప్తః** | ఆతేజః ప్రాణశక్తులు తనవని ఏ జీవుడైనా భావిస్తే వాడి దర్పాన్ని అణగగొడుతుంది. అసలా దర్పం వాడికది ఇస్తే వచ్చిందే. అది ఇచ్చిన దర్పమే గనుక ఈ దర్పించిన వాడు వీడు కాదు. అదే వాస్తవానికి. |
| **దుర్ధరః అపరాజితః** | చరాచర సామగ్రితో దర్పించినది గనుక దానినెవరూ ఎత్తలేరు. ధరించలేరు. మోయలేరు. అన్నింటినీ అదే మోస్తున్నది. అలా మోస్తున్నా (అపరాజిత) శ్రమ ఏ మాత్రమూ లేదు దానికి. |
| **విశ్వమూర్తిః మహామూర్తిః దీప్తమూర్తిః అమూర్తిమాన్** | విశ్వమంతా దాని రూపమే. ఎంత విస్తారంగా నైనా ఉందా రూపం. కేవలం జడం కాదది. జ్ఞానంచేత ఎప్పుడూ దీప్తమైనది. జ్ఞాన మెప్పుడూ నిరాకారమే గనుక రూపమని అంటున్నా రూపంగాని రూపమది. |
| **అనేకమూర్తిః అవ్యక్తః శతమూర్తిః శతాననః** | రూపం కానిదే అనేక రూపాలుగా భాసిస్తున్నది. రూపం లేకుండా అది అవ్యక్తం. రూపమేర్పడితేనే అది వ్యక్తమై కనిపిస్తుంది. శతసహస్ర రూపాలతో కనిపిస్తుంది. శతసహస్ర ముఖాలతో (ఆనన) వ్యాపిస్తుంది. |
| **ఏకః నైకః** | ఏకమూ అదే, అనేకమూ అదే. స్వరూపంగా ఏకం, నామరూపాది విభూతిగా అనేకం. |
| **సవః** | అదే తనకు తాను ప్రసవమయింది. |
| **కః కిమ్ యత్ తత్** | ఎవడన్నా అదే, ఏదన్నా అదే. ఏదైతే అన్నా అదే. అదన్నా అదే. సర్వనామమది. సర్వనామాలూ దానివే. |

| | |
|---|---|
| **పద మనుత్తమమ్** | అది ఒక పదం. దానికన్నా ఉత్తమమైన పదం లేదు. పదమంటే మాటకావచ్చు. స్థానం కావచ్చు. చెప్పే మాటలేదు. చెప్పబడే స్థానంలేదు. వాచ్యవాచకాలు రెండూ లయమయ్యే తత్త్వమది. |
| **లోకబంధుః**<br>**లోకనాథః**<br>**మాధవః**<br>**భక్తవత్సలః** | అయినా వాచ్యవాచకరూపమైన లోకంతో సంబంధం పెట్టు కొన్నాడా ఈశ్వరుడు. లోకానికంతా నియామకుడు. మరలా న+అథ - గమ్యం కూడా, మా ఈ లోకవిభూతి కంతా ధవ-భర్త, కనుకనే దాన్ని గాక తన్ను భజించిన వారికే వత్సలుడు. వారిలో వసిస్తాడు. |
| **సువర్ణవర్ణః**<br>**హేమాంగః**<br>**వరాంగః**<br>**చందనాంగదీ** | సువర్ణం చైతన్యప్రకాశమే. అదే వర్ణం పరమాత్మకు. అదే అంగం. శరీరం కూడా. చిద్రూపం కాబట్టి శ్రేష్ఠమైన (వర) దా శరీరం. అంగద అంటే ఆభరణాలు. ప్రీతికరమైన నామరూపాలే ఆభరణాలు దానికి. |
| **వీరహా**<br>**విషమః** | విశేషంగా బయటపడ్డదంతా హతం చేసినవాడా పరమాత్మ, విషమ తనకు సమానుడు లేనివాడు. |
| **శూన్యః**<br>**ఘృతాశీః** | స్వగతమైన భేదమసలే లేనివాడు (శూన్య) కరగిపోయిన (ఘృత) కోరికలు (ఆశీః) కలవాడు - నిష్కాముడు. |
| **అచలః**<br>**చలః** | కామం లేకుండా అచలుడు. పెట్టుకొంటే చలుడు. రెండూ ఆయన చేతిలోనే ఉన్న ద్వంద్వాలు. |
| **అమానీ**<br>**మానదః**<br>**మాన్యః**<br>**లోకస్వామీ**<br>**త్రిలోకధృక్** | తన కభిమానం లేనివాడు. మనకది ప్రసాదించేవాడు. ఎందు కిచ్చాడో దాని అంతరార్థం బాగా మననం చేసి చూస్తే (మా+అన్య) నీవు నాకు వేరుకాదని బోధించేవాడూ, ఇంతకూ లోకానికంతా స్వామి. ఆయన సొమ్మిది. త్రిలోకాలనూ అదుపులో పెట్టుకొనే వాడికేమిటి జవాబు. అప్రధృష్యుడు. |

**సుమేధాః** జ్ఞానమనేది మూర్తీభవించినవాడు. మేధ అంటే యజ్ఞం. జ్ఞాన
**మేధజః** యజ్ఞం. చేస్తే జన్మిస్తుంది. ఏమిటి ధనం. దానితో ధన్యులమైతే
**ధన్యః సత్యమేధాః** (సత్య) ఎప్పటికీ నిలిచే జ్ఞాన ధనమవుతుంది.

**ధరాధరః** తన్మూలంగా అన్నిటినీ ధరించే మాయాశక్తిని కూడా ధరించి ధరాధరుడు కాగలడు సాధకుడు.

**తేజోవృషః** తన తేజస్సునే జగద్రూపంగా వర్షిస్తున్న చైతన్యమది. దానినే
**ద్యుతిధరః** మరలా అధిష్ఠానరూపంగా ధరిస్తున్నది.

**సర్వశస్త్ర** శస్త్రమంటే విషయజ్ఞానం. అది ధరించినవారు జీవులు.
**భృతాంవరః** వీరందరికీ వరణీయుడు ప్రార్థనీయుడు ఈశ్వరుడు. నరులక యనమైన వాడు నారాయణుడు.

**ప్రగ్రహః** సర్వశక్తులూ ప్రకర్షంగా పట్టుకొని (గ్రహ) ఉన్నవాడూ.

**నిగ్రహః** ఎన్ని శక్తులున్నా బయటపెట్టనివాడు. పెట్టాలని సంకల్పిస్తే
**వ్యగ్రః** వివిధ రూపాలుగా బయటపెట్టేవాడూ ఆ పరమాత్మే.

**నైకశృంగః** అనేక శాఖలుగా ప్రసరించేదా పరమాత్మ చైతన్యం.
**గదాగ్రజః** అంతగా ప్రసరిస్తున్నా (గద) వాక్కుల కందనంత (అగ్ర) ఎత్తులో ఉన్నది.

**చతుర్మూర్తిః** విరాట్, సూత్ర, అవ్యాకృత, తురీయములనే నాలుగు మూర్తులూ
**చతుర్బాహుః** సత్త్వ రజస్తమ శ్శుద్ధ సత్త్వాలనే నాలుగు బాహువులూ వాసుదేవ
**చతుర్వ్యూహః** సంకర్షణాదులైన నాలుగు వ్యూహాలూ-కర్మభక్తి యోగ జ్ఞానాలనే
**చతుర్గతిః** నాలుగు గతులూ కలిగినదది.

**చతురాత్మా** విశ్వతైజస ప్రాజ్ఞ తురీయాలనే నాలుగాత్మలూ ధర్మ అర్థకామ
**చతుర్భావః** మోక్షాలనే నాలుగు భావాలూ కూడా కలదది. ఋగాదులైన

| | |
|---|---|
| **చతుర్వేదవిత్** | నాలుగు వేదాలుగా అవతరించినవాడు. వాటి ద్వారానే మరలా |
| **ఏకపాత్** | అందుకోవలసినవాడు. అప్పుడీ నాలుగులన్నీ కలిసి ఏకమే. |
| | అది చేర్చేది గాదు. చేరే పాదం లేక పదం (పద్యతే ఇతి) |
| **సమావర్తః** | అయితే సాధకుడు మిగతా అన్నిటినుంచీ బాగా వైదొలగి దాని |
| **అనివృత్తాత్మా** | నుంచి ఎప్పుడూ తొలగకుంటేనే అది లభ్యం. |
| **దుర్జయః** | అలాంటి సాధన లేకుంటే ఎప్పుడూ మన కజేయుడే. అనతి |
| **దురతిక్రమః** | క్రముడే ఆ పరమాత్మ. |
| **దుర్లభః** | అసలది అందుకోలేము. చేరలేము. పొందలేము. కత్తి వాదర |
| **దుర్గమః** | లాంటి దామార్గం. అందులో నడచిపోవటం కష్టమే. గమ్యం |
| **దుర్గః** | చేరటం కష్టమేనంటున్నది శాస్త్రం. చేరటమే కష్టమైతే అందులో |
| **దురావాసః** | మనం వసించటం కలలోని వార్త. మనలో ఉన్న అసుర |
| **దురారిహా** | భావాలను నిర్మూలిస్తే అది ఎప్పటికైనా మన సొమ్మవుతుంది. |
| **శుభాంగః** | శుభవాసనలే దానినందుకొనే సామగ్రి. లోకంలో సారమేదో |
| **లోకసారంగః** | అదే దాని స్వరూపం. పూసలలో దారంలాగా సకల విశేషాలను |
| **సుతంతుః** | వ్యాపించి ఉన్నదది. సుతంతు. అది గుర్తిస్తే సంసార తంతువు |
| **తంతువర్ధనః** | నదే ఛేదిస్తుంది. (వర్ధన) |
| **ఇంద్రకర్మా** | అసలీ సంసారి అయిన జీవుడు (ఇంద్ర) చేసే కర్మలన్నీ ఆయన |
| **మహాకర్మా** | కర్మలే. ఈశ్వరుడు చేసేవీ ఆయనవే. అసలు క్రొత్తగా చేయటం |
| **కృతకర్మా** | కాదు. ఎప్పుడో చేసినవే సకలకర్మలూ. చేసినదే చేయటంగా |
| **కృతాగమః** | వస్తున్న (ఆగమ) ప్రవాహమిది. |
| **ఉద్భవః** | చలనాత్మకమైన ఈ కలాపమంతా చలనం లేని దాని నుంచి |
| **సుందరః** | ఉద్భవించినదే. అచలంగా ఉంటే సౌందర్యం లేదు. చలించి |

**సుందః** నామ రూపాలుగా పరిణమిస్తేనే సుందరుడాయన, వాటికి (సుం) సౌష్ఠవాన్ని (ద) ఇస్తున్నవాడు మరలా తానే.

**రత్ననాభః** విలువైన ఆ గుణరత్నాలన్నీ ఆయనలోనే గుప్తమయి ఉన్నాయి.
**సులోచనః** ఆయన చూపులోనే అవి వెలువడుతున్నాయి.

**అర్కః** అలా వెలువడిన నామరూపాది గుణాలద్వారానే మన మర్చించ
**వాజసనః** వలసిన తత్త్వమది. అర్చిస్తే ప్రసన్నుడయి (వాజ) బలాన్ని (సన)
**శృంగీ** అనుగ్రహిస్తాడు సాధకుడికి (శృణాతీతి శృంగీ) చీల్చి వేస్తాడు కూడా తాపత్రయాన్ని.

**జయంతః** అదే సాధకుడైన వాడికి జయం. సర్వమ్ విష్ణుమయమని
**సర్వవిత్ జయీ** దర్శించటమే జయం.

**సువర్ణ బిందుః** సువర్ణం ఓకారం, బిందువు మకారం, రెండూ కలిస్తే ఓమ్. ఓంకార రూపుడు పరమాత్మ. వాచకమూ వాచ్యమూ కూడా. సువర్ణములంటే నామరూపాలు - బిందువంటే శూన్యం. నామరూపాలూ పరమాత్మే – తద్రహితుడూ ఆయనేనని భావం.

**అక్షోభ్యః** ఎంత సగుణుడైనా గుణక్షోభం చేత మరలా క్షుబ్ధుడు కాడు.

**సర్వవాగీశ్వరేశ్వరః** కారణం వాచకమైన ఈ గుణ సృష్టికంతటికీ అధీశుడు - వైఖరి నుంచి పరా వరకున్న వాక్కులన్నిటికీ అతీతుడు.

**మహాహ్రదః** ప్రతిభావమూ దానినుంచే రావాలి కాబట్టి అది చాలా లోతైనది.
**మహాగర్తః** ఒక పెద్ద అఖాతమది. దిగలేము. అందుకోలేము.

**మహాభూతః** భూతం కాదది ఇది ఇంత అని నిర్ణయించటానికి. మహాభూతం -
**మహానిధిః** మహానిధి కూడా. అన్నీ అందులోనే నిహితమయి ఉన్నాయి.

**కుముదః** (కు) తనకు విలోమంగా ఏర్పడ్డ సృష్టిని చూచి ఆనందిస్తాడు.
**కుందరః** దాన్ని మరలా (దర) విదారణం చేసి తనలో కలుపుకొంటాడు.
**కుందః** అలా కలుపుకోమనే మనకది (ద) ప్రసాదిస్తున్నాడు.

**పర్జన్యః** పరిపరిదేహాలలో జీవులుగా జన్మిస్తూ – వారిని సాధకులుగా
**పావనః** మార్చి పరిశుద్ధులను చేస్తూ అసలేదీ చేయకుండా అచలస్థితిలో
**అనిలః** (అన్+ఇల) ఉన్నాడు.

**అమృతాశః** ఒక అశనముందాయనకు, దానితో పెరిగే శరీరముంది.
**అమృతవపుః** అశనం ప్రపంచం. శరీరం చైతన్యం, అయితే మృతంకావు
**సర్వజ్ఞః** రెండూ–ఎప్పటికీ అమృతమే. అసలీ అశనాదులన్నీ గ్రహిస్తున్న
**సర్వతోముఖః** దదే. సర్వతో ముఖమైనదా జ్ఞానం. జ్ఞాతా, జ్ఞానం, జ్ఞేయం మూడూ అదే.

**సులభః** మూడూ అదే గనుక సుళువుగా లభిస్తుంది. కాని దృఢమైన
**సువ్రతః** దీక్ష ఉండాలి మనకు. అలాంటి చూపున్న వాడికది సిద్ధమే
**సిద్ధః** క్రొత్తగా సాధించవలసింది కాదు.

**శత్రుజిత్** సిద్ధుడైన మానవుడికిక సంసారమనే శత్రువు వల్ల బాధలేదు.
**శత్రుతాపనః** దాన్ని జయించగలడు. దానివల్ల తాను తపించటం కాదు. దాన్నే తపింప చేయగలడు.

**న్యగ్రోధోదుంబరః** (న్యక్+రోధ) ప్రతి ఒక్క నిరోధాన్ని క్రిందుపరచి (ఉత్+ఉంబర) అద్భుతంగా పైకి లేచిన తత్త్వమది. అంబరంలాగా స్వచ్ఛమూ నిర్లిప్తమైనది.

**అశ్వత్థః** నిత్యమూ చలిస్తూ పోయే ఈ కాలమనే అశ్వాన్ని స్థ – అధిష్ఠించి కూచున్నది.

**చాణూరాంధ్ర నిషూదనః** (చాణూర) శోకాన్నీ (ఆంధ్ర) అంధత్వాన్ని ఆపాదించే మోహాన్నీ రెండింటినీ నిర్మూలించేది.

**సహస్రార్చిః** ఇంకా ఎలాంటిదా చైతన్యదీప్తి. సహస్ర గుణంగా ప్రజ్వలిస్తున్నది.
**సప్తజిహ్వః** భూత పంచ మహదహంకారాలనే సప్తజ్వాలలతో ప్రసరిస్తున్నది.
**సప్తైధాః సప్తవాహనః** శబ్ద స్పర్శాదులూ మనన ధారణలనే సప్త సమిధల నాహుతి చేసుకొనేది. సప్తేంద్రియాలనే వాహనాలతో అటూ ఇటూ తిరుగుతున్నది.

**అమూర్తిః అనఘః అచింత్యః భయకృత్ భయనాశనః** శుద్ధ చైతన్యమే గనుక అమూర్తమా స్వరూపం. అందుకే ఏదీ అంటనిదది. మనసుతో చింతించినా అదీ దానినంటదు. దేని అంటు సొంటు లేకుండానే అన్ని భయాలూ మనకంట జేస్తుంది. మనమూ సాధకులమై అంటకుండా మెలగితే భయాన్ని తొలగిస్తుంది.

**అణుః బృహత్ కృశః స్థూలః** దాని గొప్ప తన మెలాటిదంటే అదే అణువు. అదే మహత్. అదే సన్నం – అదేలావు.

**గుణభృత్ నిర్గుణః మహాన్** గుణాలన్నీ ఉన్నదీ అదే – ఏ గుణమూ లేనిదీఅదే. వీటితో లావాదేవీ పెట్టుకొని కూడా ఏ సంసర్గమూ లేక వీటికతీతంగా మెలగేదీ అదే.

**అధృతః స్వధృతః** ఇలాంటి తత్త్వం గనుకనే అది దేనిచేతా ధరింపబడదు. అదే దాన్ని ధరించి ఉంటుంది. (Self Contained)

**స్వాస్యః** స్వ ఆస్య - దాన్ని అదే కబళిస్తుంది. అన్నమూ అన్నాదుడూ
**ప్రాగ్వంశః** అదే గనుక. దాని వంశమైన ఈ సంసార మతి పురాతనం.
**వంశవర్ధనః** ఈ వంశాన్ని పెంచేదీ అదే (వర్ధన) మరలా త్రుంచేదీ (వర్ధన) అదే.

**భారభృత్** ఈ సమస్త భారమూ అదే వహిస్తున్నది. శబ్ద ప్రపంచమంతా
**కథితః** చెప్పే (కథిత) ఏకైకమైన అర్థమది.

**యోగీ** శబ్దరూపమైన సృష్టితో ఓతప్రోతమై ఉన్నదా అర్థం. అలా
**యోగీశః** ఉండి కూడా దీని కీశం-అతీతమైనది. ఈ రహస్యాన్ని గుర్తిస్తే
**సర్వకామదః** మరి దేనిమీదా కామం లేకుండా (ద) ఖండించి వేసేది అదే.

**ఆశ్రమః** ఖండించి సంసార శ్రమను పూర్తిగా రూపుమాపేది అదే. అందు
**శ్రమణః** కోసమే ఈ జీవుడు యావజ్జీవం శ్రమించవలసింది. అదీ ఎంతో
**క్షామః** (క్షమ) సహనంతో సాగించవలసి ఉంటుందా శ్రమ.

**సుపర్ణః** అభ్యాస వైరాగ్యాలనే పర్ణాలు గల ఈ మనస్సునూ నిత్యమూ
**వాయువాహనః** రాకపోకలు చేసే ఈ ప్రాణ వాయువునూ అందుకోసమే మనకు
సాధనాలుగా ప్రసాదించాడా పరమాత్మ.

**ధనుర్ధరః** మనః ప్రాణాలనే సూక్ష్మశరీరంతో స్థూలమైన ఈ ధనుస్సును
**ధనుర్వేదః** (దేహాన్ని) ధరించాము మనం. మరలా ఈ ధనుస్సు ద్వారానే
**దండః** దాన్ని (వేద) అందుకోవలసి ఉంది. అలా అందుకోటానికి
**దమయితా** సహాయంగా (దండ) శాస్త్రాన్నీ (దమయితా) శాసకుడైన
**దమః** గురువునూ (దమ) దానికి తగిన శిక్షణనూ మనకు
సమకూర్చాడు జీవితంలో.

**అపరాజితః** అలాంటి శిక్షణనందుకొంటే జీవితంలో పరాజయం కలగదు.
**సర్వసహః** అన్ని విఘ్నాలనూ ఎదిరించి నిలవగలడు.

**నియంతా** ఆ పరమాత్మ వాటికి నియంత అయి నియమిస్తాడు. అప్పుడిక
**నియమః** యముడనే ప్రశ్నేలేదు. యముడంటే కాలం. కాలప్రభావం లేదు
**అయమః** మనమీద.

**సత్త్వవాన్** నియమా నియమాలు రెండూ సమపాళ్ళలో ఉన్నాయా
**సాత్త్వికః** పరమాత్మలో నిర్దోషం హి సమం బ్రహ్మ, అలా ఉన్న సాధకుడికి
**సత్యః** అనుకూలుడు. త్యత్తంటే విలోమం దానితో కూడిన అనులోము
**సత్యధర్మపరాయణః** డాయన । (సత్య) దానినే ఆలంబనగా చేసుకొన్న వారికి
**అభిప్రాయః** పరాయణుడు. అభి-ప్ర-అయ-ఆ సత్యానికభిముఖంగా వెళ్ళి
**ప్రియార్హః** అందుకోవలసినవాడు. అలాంటి అర్హతే తనకు ప్రియమనే
**అర్హః** వాడు. అలాటి భావనతోనే అర్హ పూజించవలసిన వాడు -
పూజిస్తే ఇష్టమైనదంతా ఇచ్చేవాడు.
**ప్రియకృత్** దానిమీద ప్రీతిని త్రుంచివేస్తూ తనమీద ప్రీతిని పెంచుతూ
**ప్రీతి వర్ధనః** పోయేవాడు.

**విహాయసగ-** ఆకాశమంతా వ్యాపించిన జ్యోతి అది. దీనినంతా విహాయ-
**తిర్జ్యోతిః** వదిలేసి (సగతి) గమనం చేసి అందుకోవలసిన ప్రకాశమది.

**సురుచిః** సురుచి-చైతన్యరూపమైన జ్యోతి అది. సురుచి దాని రుచి బాగా
**హుతభుక్** తెలిసి (హుత) తనదనేది అంతా అందులో హోమం చేసి భుక్
**విభుః** అనుభవించవలసింది, అప్పుడది విభు-సర్వత్రా దర్శన
మిస్తుంది.

**రవిః** సాధకుడిలో ఉండే రసాన్ని (వాసనలను) పీల్చేస్తాడు మొదట
**విరోచనః** విశేషమైన తన దీప్తిని ప్రసరింపజేస్తాడు పరమాత్మ.
**సూర్యః** సూర్య తన చైతన్యాన్నే వర్షిస్తాడతని మీద.

| | |
|---|---|
| **సవితా రవిలోచనః** | (సవితార + విలోచన) విశేషంగా తరింపజేసేది సవితారం. అలాటి దీప్తితో కూడిన విలోచన చూపది. |
| **అనంతః హుతభుక్ భోక్తా** | అంతంలేనిదా చూపు. భోక్తననే భావం హుతం చేసి భుజించాలి దాన్ని సాధకుడు. అప్పుడేవాడు భోక్త కాని భోక్త పూర్ణభోక్త అవుతాడు. |
| **సుఖదః** | అలాంటివాడిదే పూర్ణమైన సుఖం. ఆ సుఖాన్ని అదే ప్రసాదిస్తుంది. |
| **నైకజః అగ్రజః** | అనేక రూపాలుగా జన్మిస్తున్నదీ - అన్నింటికీ ముందు జన్మించినదీ తానేనని భావిస్తాడు. |
| **అనిర్విణ్ణః సదామర్షీ లోకాధిష్ఠానమ్** | జన్మిస్తున్నా, జన్మించకున్నా ఎప్పుడూ విసుగు చెందడు. అన్ని భావాలనూ ఎప్పుడూ సహిస్తూనే (మర్షీ) ఉండగలడు. ఆరోపిత జగత్తు అనులోమ ప్రతిలోమాత్మకమైనా దాని కధిష్ఠానం గనుక రెండూ సమానమే దానికి. |
| **అద్భుతః** | అభూతమే అద్భుతం. భూతం కానిది కనుకనే దానికది సంభవమైంది. అందుకే మన దృష్టికది అద్భుతం. |
| **సనాత్సనా-తనతమః** | అద్భుతం - ఎప్పుడూ భూతం అంటే ఏర్పడినది కాదు గనుకనే సనాతనం కన్నా సనాతనమైన తత్త్వమది. |
| **కపిలః కపిః అప్యయః స్వస్తిదః స్వస్తికృత్ స్వస్తి** | కంపన శీలమైనదేదో అది కపిల. అంత అభూతమయి కూడా చలిస్తున్నదది. అదే అద్భుతం. అది చలించటం వల్లనే చలిస్తున్న ఈ జీవుడేర్పడ్డాడు (కపి) ఏర్పడి మరలా దానిలోనే (అప్యయ) లయమయి పోతున్నాడు. జీవుడప్యయం చెందితే అది వాడికి స్వస్తిదం. సు+అస్తి-కేవలా స్తిత్వాన్ని పొందుతాడు. అది కలిగిస్తాడాయన వాడికి. అదే స్వస్తి శ్రేయస్సు మానవుడికి, దానినే భుక్ - అనుభవించాలెప్పటికైనా. |

| | |
|---|---|
| **స్వస్తిభుక్** | అయితే ఊరక రాదా అనుభవం. మనం స్వస్తి అనుకొనేదంతా |
| **స్వస్తి దక్షిణః** | దానికి దక్షిణగా సమర్పించాలి. తప్పదు. |

| | |
|---|---|
| **అరౌద్రః** | ఎలా ఉంటుందా అనుభవం. రుద్ర అంటే ప్రాణం. ప్రాణచలనం |
| **కుండలిచక్రీ** | లేనిదది. (కుండలీ) ఆది మధ్యాంతరహితం చక్ర- సర్వతోముఖం. |
| **విక్రమీ** | విక్రమ-విశేషమైన నామరూప ప్రపంచంగా భాసించేది. భాసిస్తూ |
| **ఊర్జితశాసనః** | మరలా దాని మీద గొప్ప అధికారం గలిగినది. |

| | |
|---|---|
| **శబ్దాతిగః** | స్పందరూపమైన వాక్కున కందనిది. వాక్కును భరించేది-భరించి |
| **శబ్దసహః** | అచలంగా నిలిచి ఉండేది. (శిశిర) (అతిశయేన శేతే ఇతి శిశిర). |
| **శిశిరః** | అలాటి యోగనిద్రలో తానుంటూ మనకీ అజ్ఞానమనే గాఢ |
| **శర్వరీకరః** | నిశీథాన్ని (శర్వరీ) కల్పించినది. |

| | |
|---|---|
| **అక్రూరః** | కల్పించినా క్రౌర్యం లేదా పరమాత్మకు. పేశల-దయార్ద్ర |
| **పేశలః** | స్వభావుడే. దక్ష-సర్వసమర్థుడు కూడా. (దక్షిణ) వక్రమైనది |
| **దక్షః** | కాదా సామర్థ్యం. ఋజువైనది. ఋజుస్వభావుడు కనుక |
| **దక్షిణః** | క్షమించగలడు. కాని మన మాయనను వరిస్తేనే క్షమించి |
| **క్షమిణాంవరః** | మరలా మనలను వరిస్తాడు. |

| | |
|---|---|
| **విద్వత్తమః** | విద్వత్తముడాయన. అన్నీ అర్థం చేసుకోగలడు. అద్వితీయుడు |
| **వీతభయః** | గనుక ఏ భయమూ లేదాయనకు. తత్సాంగత్యంతో మనకూ |
| **పుణ్యశ్రవణ** | లేదు భయం. జీవుడు తాను శ్రవణం చేసి మరొకరికి కీర్తనం |
| **కీర్తనః** | చేస్తే చాలు. పవిత్రుడయిపోతాడు. |

| | |
|---|---|
| **ఉత్తారణః** | ప్రసన్నుడయి ఆయనే ఈ సాధకుణ్ణి గట్టున పడవేస్తాడు. వీడి |
| **దుష్కృతిహా** | సంచిత కర్మనంతా పటాపంచెలు చేస్తాడు. పునాతీతి పుణ్యః - |
| **పుణ్యః** | సత్త్వాన్ని శుద్ధి చేస్తాడు. కోట్లజన్మలనుంచీ వీడు కనే |
| **దుఃస్వప్ననాశనః** | సంసారమనే పీడకలను రూపుమాపుతాడు. |

**వీరహా**
**రక్షణః**
**సంతః**
**జీవనః**
**పర్యవస్థితః**

విరుద్ధంగా నడచుకొనే గర్విష్ఠులను క్షమించడు. త్రోసి పారేస్తాడు. అలాకాకుంటే రక్షణ ఇస్తాడు. వివేచనాశీలు రందరూ (సంతః) ఆయన కాత్మీయులే, వారందరికీ జీవన ప్రదాత ఆయనే. వారిలో భావంలో బాహ్యంలో స్థిరంగా నెలకొన్నవాడా ఈశ్వరుడే.

**అనంతరూపః**
**అనంతశ్రీః**
**జితమన్యుః**
**భయాపహః**

హద్దులేకుండా వ్యాపించిన రూపమది. దానికి భంగంలేదు. దాని నాశ్రయించి ఉన్న శక్తికి (శ్రీ) కూడా నాశం లేదు. ఆ రెండింటి కలయికే ఈ సృష్టి. కాబట్టి ఈ జీవకోటి మీద (మన్యు) ఆగ్రహ మెప్పుడూ లేదు. లేకపోగా వీరి భయాన్ని నిర్మూలించేది అదే.

**చతురశ్రః**
**గభీరాత్మా**
**విదిశః**
**వ్యాదిశః**
**దిశః**

శక్తి గలదది కనుక నలువైపులా పదునుగలది. లోతుకు దిగే కొద్దీ లోతైన స్వరూపమది. అంతుచిక్కదు. చిక్కకుండా ఎక్కడో దాగి ఉన్నదా అంటే అలా కాదు. దిశలూ, విదిశలూ అన్ని వైపులా అదే. అన్నీ కూడా అదే. అంతేకాదు – అన్నీ తానే అయి మరలా అన్నింటినీ ఆదేశిస్తుంటుంది.

**అనాదిః**
**భూః**
**భువః**
**లక్ష్మీః**

ఆది (కారణం) లేనిదది. కారణం లేకుండానే కార్యరూపంగా (భూః) జన్మిస్తున్నది. జన్మించటమే కాక చరాచరాలన్నింటినీ (భువః) జన్మింపజేస్తున్నది. చేసి వీటినే లక్షణంగా చేసుకొని తన తత్త్వాన్ని లక్షించండని చెబుతున్నది.

**సువీరః**
**రుచిరాంగదః**

ఎవడైనా ఈ లక్షణాన్ని బట్టి ఆ లక్ష్యాన్ని గుర్తిస్తే అలాంటి గొప్ప వీరుడికి ఉజ్జ్వలమైన (రుచిర) జ్ఞానమనే (అంగ) విగ్రహాన్ని (ద) ప్రసాదిస్తుంది. ప్రజ్ఞాన స్వరూపుడవుతాడీ సాధకుడని భావం.

| | |
|---|---|
| **జననః** | ప్రాణులను సృష్టించిందీ అదే - సృష్టించి వాటి జన్మను ఆది+ |
| **జనజన్మాదిః** | కబళించేదీ అదే, సంసార భయాన్ని నెత్తిన పడవేసేదీ అదే. |
| **భీమః** | భయంకరమైన పరాక్రమంతో దాన్ని నిర్మూలించి వీడిని |
| **భీమపరాక్రమః** | కడతేర్చేదీ అదే. |

| | |
|---|---|
| **ఆధారనిలయః** | ఆధారంలో లయింపచేసేదీ అదే ఆధారాని కాధారమై దాన్ని |
| **ఆధాతా** | ధరించేదీ అదే. |

| | |
|---|---|
| **పుష్పహాసః** | అధిష్ఠానంగా ఉంటూ తన మహాశక్తి అనే పుష్పం వికసించి |
| **ప్రజాగరః** | (హాస) అదే ప్రపంచమనే ఫలంగా మారి భాసిస్తున్న వాడా ఈశ్వరుడు. అయినా ఏ భూమికలోనూ విస్మృతి లేని జాగృతి కలవాడు. |

| | |
|---|---|
| **ఊర్ధ్వగః** | కనుక దీనిలో నిమగ్నుడు కాడు. పైపైన మెలగుతుంటాడు. |
| **సత్పథాచారః** | తన సత్తయే తాను సంచరించే మార్గం. |

| | |
|---|---|
| **ప్రాణదః** | అనాహతరూపమైన ప్రాణంగా శరీరంలో ప్రవేశించింది. |
| **ప్రణవః** | ఆహత రూపమైన ప్రణవనాదంగా లోపల వినిపిస్తున్నది. |
| **పణః** | తదుపదేశంతో తన్ను తానే కీర్తిస్తున్నది. (పణ) |

| | |
|---|---|
| **ప్రమాణమ్** | ఒకటి ఉందని దాని ఉనికిని కొలిచేదీ - కొలిచే క్రియ |
| **ప్రాణనిలయః** | కాధారమూ దానిని ధరించినదీ - దాని నెడబాయక నిత్యమూ |
| **ప్రాణభృత్** | దానితో సహా జీవనం సాగించేదీ - ఈ క్రియా కలాపమంతా |
| **ప్రాణజీవనః** | ఆ ఈశ్వర చైతన్యమే. |

| | |
|---|---|
| **తత్త్వమ్** | తత్త్వం పదార్థాలైన జీవేశ్వరులూ అదే - వాటి ఐక్యమూ అదే |
| **తత్త్వవిత్** | దాన్ని గ్రహించిన సాధకుడూ అదే. అదీ ఇదీ అనే తేడా లేని |
| **ఏకాత్మా** | ఏకాత్మ స్వరూపమూ అదే. |

| | |
|---|---|
| **జన్మమృత్యు జరాగతిగః** | ఏకాత్మ అన్నప్పుడు అనాత్మ కూడా ఆత్మే కాబట్టి ఇక జన్మ మరణాదులన్నిటికీ అతీతమైనదా ఆత్మ. |
| **భూర్భువస్స్వస్తరుః తారః సవితా ప్రపితామహః** | తేజోఉ బన్నాలనే మూడు వృక్షాలకూ బీజమా చైతన్యం. వాటిని ఛేదించి తరింపజేసేది అదే. అన్నిటినీ ప్రసవించి అన్నింటినీ పాలించే ప్రకృష్టమైన (మహః) తేజస్సదే. |
| **యజ్ఞః యజ్ఞ పతిః యజ్వా** | ఈ జీవితమనే యజ్ఞమూ, ఈ యజ్ఞానికి అధిపతీ, యాజకుడూ కూడా ఆ ఈశ్వరుడే. |
| **యజ్ఞాంగః యజ్ఞవాహనః** | యజ్ఞోపకరణ సామగ్రీ – యజ్ఞఫలాన్ని మోసుకుపోయే అగ్నిహోత్రుడూ ఆయనే. |
| **యజ్ఞభృత్ యజ్ఞకృత్** | యజ్ఞకుండమూ యజ్ఞ కర్త యజమానుడు కూడా ఈశ్వరుడే. |
| **యజ్ఞీ యజ్ఞభుక్ యజ్ఞ సాధనః** | యజింపబడే దేవతా – యజ్ఞానుష్ఠానఫల భోక్తా – యజ్ఞాన్ని చేసే ప్రయత్నమూ – దానివిధానమూ కూడా ఈశ్వరుడే. |
| **యజ్ఞాంతకృత్ యజ్ఞగుహ్యమ్** | చివరకీ జీవిత మహాయజ్ఞాన్ని సమాప్తం చేసేవాడూ ఆయనే. ఇంతెందుకు. యజ్ఞారంభం నుంచి యజ్ఞాంతందాకా సర్వమూ ఈశ్వర చైతన్య విలాసమే. ఇదే ఈ యజ్ఞరహస్యం. |
| **అన్నమ్ అన్నాద ఏవచ** | తినబడేది అన్నం – తినేది అన్నాదం, అంటే చేయబడే యజ్ఞం చేసే యజ్వ – జీవ జగత్తులని భావం. ఇవి రెండూ పరమాత్మ అంశాలే. అలాంటప్పుడిక ద్వైత ప్రపంచమెక్కడ ఉంది. ఉన్నదంతా ఈశ్వర స్వరూపమే. |

**ఆత్మయోనిః స్వయంజాతః వైఖానః సామగాయనః** అంచేత ఏది ఎక్కడ జన్మించిందని చెప్పినా దానివల్ల అదే జన్మిస్తున్నది. అంతకన్నా వేరుగా జన్యమూ లేదు. జనకమూ లేదు. విశేషంగా తన్ను తాను ఖననం చేసుకొని జగత్తును సృష్టించింది. తనతో సమాన లక్షణుడైన జీవుడి రూపం ధరించి అందులో ప్రవేశించింది. సామగ+అయన.

**దేవకీనందనః** దీవ్యతి-క్రీడతీతి దేవీ - స్వార్థేకప్-దేవకీ-యోగ మాయ అని అర్థం. దానితో నిత్యమూ (నందన) ఆనందిస్తుంటాడు.

**స్రష్టా క్షితీశః పాపనాశనః** తదానందఫలంగానే సృష్టిస్తాడు. క్షితి, దీని స్థితికి కర్త అయ్యాడు. అవిద్యాదులైన త్రివిధ పాపాలను మరలా లయం చేస్తాడు.

**శంఖభృత్ నందకీ చక్రీ శార్ఙ్గధన్వా గదాధరః** పాంచజన్యమనే శంఖమూ, నందకమనే ఖడ్గమూ సుదర్శన మనే చక్రమూ శార్ఙ్గమనే ధనుస్సూ - కౌమోదకి అనే గదా దండమూ ధరించి సగుణంగా మనకు సాక్షాత్కరిస్తాడు కూడా. అవి ఆయన చేతుల్లో దివ్యాయుధాలైతే మనకూ ఉన్నాయి ఇంద్రియాల రూపంలో శంఖం మన కర్ణం - నందకం చక్షుస్సు - చక్రం మనస్సు-శార్ఙ్గం ప్రాణం, గద వాక్కు

**రథాంగపాణిః** ఇవి మన దగ్గరే ఉన్నా శరీరమనే రథమూ ఈ ఇంద్రియాలనే సామగ్రి వీటి ప్రవృత్తి నివృత్తులు రెండూ ఆయన చేతిలో ఉన్నాయి.

**అక్షోభ్యః సర్వప్రహరణాయుధః** వాటి సహాయంతో శ్రవణ మనన దర్శనాదులు చేయకపోతే అవే శంఖచక్రాదులైన దివ్యాయుధాలుగా మారి మనల నందరినీ ప్రహరణం చేస్తాయి. వాటి నెదుర్కొనలేము. శ్రద్ధాళువులమై సాధన చేశామో సర్వమైన సంసార బంధాలనూ ప్రహరణం చేసి అక్షోభ్యమైన ముక్తిని ప్రసాదిస్తాయి.

# ఫలశ్రుతి

విష్ణు సహస్రనామ స్తోత్రం సమాప్త మయిందిక్కడికి. స్వామివారి దర్శనం కూడా మనకు లభించింది. శంఖచక్ర నందకాది దివ్యాయుధాలతో దివ్యమంగళ విగ్రహుడు సాక్షాత్కరించాడు. అయితే ఆ సాక్షాత్కరించిన స్వరూపం మన మనసులో యావజ్జీవమూ చెదరకుండా నిలిచి ఉండాలంటే ఉపశ్రుతితో పాటు ఫలశ్రుతికూడా చేయాలి మనం. ఉపశ్రుతి ఇంతకుముందు స్తోత్రారంభంలోనే చేసి ఉన్నాము. పోతే ప్రస్తుతం స్తోత్రాంతంలో ఫలశ్రుతి చేయవలసి ఉంది మరలా.

స్తోత్రమిది ఎవరు ఎవరివల్ల శ్రవణం చేశారసలు. ఆనుశాసనికంలో భీష్ముడి వల్ల ధర్మజుడని గదా చెప్పుకొన్నాము. భీష్ముడని పేరేగాని బోధ చేసిందసలు కృష్ణుడే. కృష్ణుడంటే కాలాని కతీతమైన పరమాత్మ తత్త్వం. అది ధర్మజుడికి బోధించిందంటే ధర్మజుడెవడు. కాల స్వరూపుడైన యముడి అంశం. కాలమంటే ఏదో గాదు. మానవుడి మనస్సుకు సంకేతం. అప్పటికి మనస్సు కతీతమైన భూమికలో మసలుతున్న ఒకానొక జీవన్ముక్తుడైన సద్గురువు మనో భూమికలో కొట్టుమిట్టాడుతున్న తత్త్వ జిజ్ఞాసువైన ఒక సచ్ఛిష్యుడికి గావించే ఒక మహోపదేశంగా భావించాలి ఈ స్తోత్రాన్ని మనం. ధర్మజ భీష్మ సంవాదమనేది ఒక ఆఖ్యాయిక. ఆఖ్యాయికలన్నీ సత్యానికి కేవలం సంకేతాలు మాత్రమే. భగవత్తత్త్వ విజ్ఞానమే ఇక్కడ సత్యం.

తద్విషయంలో అయిదు ప్రశ్నలు వేశాడు ధర్మరాజు పితామహుణ్ణి. ఏది గొప్ప దైవతం – ఏది పరాయణం – పరమమైన ధర్మమేది. దేనినర్చన చేయాలి మానవుడు. ఏది జపించి ఈ సంసార బంధం నుంచి బయటపడాలని ఇలా అయిదు విధాల ప్రశ్నిస్తాడు. అయితే అయిదుగా కనిపిస్తున్నా అయిదూ కలసి ఒకే ప్రశ్న వాస్తవానికి, వాటికి సమాధానాలు కూడా భీష్ముడయిదు చెప్పినట్టు పైకి కనిపిస్తున్నదే గాని వాస్తవంలో సమాధానం కూడా ఒక్కటే. అవి ఏవో

గావు. జీవిత పరమార్థమేమిటని ప్రశ్న. అది సర్వవ్యాపకమైన విష్ణుతత్త్వమే నని జవాబు. దైవతమన్నా అదే. పరాయణమన్నా అదే. పరమధర్మమన్నా అదే. అర్చించవలసింది జపించవలసిందీ కూడా అదే. విష్ణుతత్త్వమే.

కాగా ఆ విష్ణు తత్త్వమేమిటో దానినెలా అందుకోవాలో తరువాత సహస్ర ముఖాలతో వర్ణించింది సహస్రనామం. నామమనేది రూపాన్నే గదా వర్ణిస్తుందెప్పుడైనా సహస్రనామాలూ చేస్తూ వచ్చిందదే. అయితే అన్ని నామాలూ చెబుతున్న రూపాలన్ని లేవు వాస్తవంలో. ఉన్నదొకే ఒక రూపం. అది పరమాత్మ రూపం. రూపంగా గాని రూపమది. పోతే దాన్ని పేర్కొనే నామం కూడా నామం కాని నామమే. నామరూపాలు రెండూ చివరకు నామ రూప రహితమైన తత్త్వంలో లయమయ్యేవే. అలా లయం చేసుకొని ఏకైకమైన ఆ తత్త్వాన్ని సాధకు డాత్మరూపంగా దర్శించాలని చాటటమే ఈ సహస్ర నామాలూ చేస్తున్న ఏకైకమైన ఉపదేశం. శాస్త్రమెప్పుడూ అనేకత్వాన్ని వర్ణించిందంటే అది ఏకత్వంలో మన బుద్ధిని పర్యవసితం చేయటానికే. శతమూర్తి, రమూర్తి మాన్ ఏకో-నైకః తత్త్వవిత్-ఏకాత్మా అని అక్కడక్కడా దొరలిన నామాలీ పరమార్థాన్నే మనకు రహస్యంగా సూచిస్తున్నాయి.

మానవుడీ అనేకాత్మకమైన జగత్తులో పరిభ్రమిస్తూ దానికి మూలమైన ఆ ఏకత్వాన్ని ఎప్పుడో మరచిపోయాడు. కనుకనే సర్వమూ విష్ణుమయమే అయినా వాడికా విష్ణువే విశ్వమయంగా భాసిస్తున్నది. దాని ఫలితమే ఈ సంసారబంధం. దీనికి పరిష్కారమే కోరితే ద్యౌస్సచంద్రార్క నక్షత్రా-ససురాసుర గంధర్వమ్ - ఈ చరాచర జగత్తంతా విష్ణు బలంచేతనే విధృతం - విష్ణువశంలోనే వర్తితం విష్ణ్వాత్మకమేనని దర్శించాలి. అంతేకాదు. ఇంద్రియాణి మనోబుద్ధిః వాసుదేవాత్మకాన్యాహుః క్షేత్రం । క్షేత్రజ్ఞ ఏవచ । మనః ప్రాణేంద్రియాదికమైన ఈ సంఘాతం కూడా వాసు దేవస్వరూపమేనని భావించాలి. ఏకోవిష్ణు ర్మహద్భూతమ్ ఒకే ఒక విష్ణు తత్త్వం. అదే ఈ సమస్త ప్రకృతీ-అంతః ప్రకృతీ అదే బహిఃప్రకృతీ అదే. అణువు మొదలు ఆకాశందాకా దానికి విజాతీయమైన

భావమేదీ లేదు. ఏది చూచినా వసతి-దీవ్యతి-కేవలమున్నది-ప్రకాశిస్తున్నది. అంత మాత్రమే. అని సచ్చిద్రూపమైన విష్ణు తత్త్వంతోనే ముడిపెట్టి చూడాలీ విశ్వాన్ని. అప్పుడు విష్ణువు విశ్వంగా ఎలా కనిపిస్తాడో అలాగే విశ్వం కూడా విష్ణువుగా భాసిస్తుంది. మొదటిది ఏకమనేకమైతే రెండవది అనేక మేకమయ్యే ప్రక్రియ.

అయితే ఒక్కమాట, ఏకమైన తత్త్వం మొదట గుర్తించగలగాలి ఈ అనేకత్వంలో. అలా గుర్తిస్తేనే అనేకత్వాన్ని చూచినా భయంలేదు. ఏకంగానే కనిపిస్తుంది. లేకుంటే విష్ణువు దూరమయిపోయి విశ్వం మాత్రమే ప్రత్యక్షమయి మన ప్రాణం తీస్తుంటుంది. కాబట్టి మానవుడీ లౌకిక జీవితానికి స్వస్తి చెప్పి సాధకుడై కాయేన - వాచా - మనసా - త్రికరణాలతో చేసే ప్రతిపనీ ఆ మహావిష్ణువుకే సమర్పణ చేస్తూ పోవాలి. అంటే వ్యష్టిని సమష్టిగా భావన చేయాలని అర్థం. అదే పరిపూర్ణ శరణాగతి. దానికి ఫలం ఇహంలో భోగం పరంలో మోక్షం ఆ మహావిష్ణువే మనకు ప్రసాదిస్తాడు. విష్ణువంటే త్రిమూర్తులలో విష్ణువని భ్రమపడరాదు మరలా. త్రిమూర్తులూ ముగ్గురూ కలిసి సగుణమైన భగవత్తత్త్వమే. అందులో తేడాలేదు. బ్రహ్మ అయినా, విష్ణువయినా, రుద్రు డయినా ఒక్కటే. పోతే వీటికి మూలమైన నిర్గుణ స్వరూపమేది ఉందో అదే ఇక్కడ విష్ణువనే మాట కర్థం. పదార్థాన్ని బట్టి చూచినా సర్వ వ్యాపకమైన చైతన్యమే విష్ణువు. అదే సగుణరూపంగా భోగమూ, నిర్గుణమైన ఆత్మస్వరూపంగా మోక్షమూ, సాధకుడికి ప్రసాదిస్తుందని తాత్పర్యం.

విష్ణు నామ సహస్రస్య - రహస్యమ్ యత్ప్రపంచితమ్ ।
సభాముఖే పురా - తస్య - సారోయమ్ గ్రథితో మయా ॥

శ్రూయతామ్ చింత్యతామ్ సర్వై - ర్ధ్యాయతా మనుభూయతామ్ ।
మహావిష్ణు ప్రసాదేన - జన్మ సాఫల్య మాప్యతామ్ ॥

ఇతి శ్రీమహావిష్ణు దాసః శ్రీనివాసః

# శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రమ్

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే ॥

హరిః ఓమ్

విశ్వం విష్ణుర్వషట్కారో భూతభవ్య భవత్ ప్రభుః ।
భూతకృద్ భూతభృద్భావో భూతాత్మా భూతభావనః ॥ 1

పూతాత్మా పరమాత్మా చ ముక్తానాం పరమాగతిః ।
అవ్యయః పురుషః సాక్షీ క్షేత్రజ్ఞో ఽక్షర ఏవచ ॥ 2

యోగో యోగవిదాం నేతా ప్రధాన పురుషేశ్వరః ।
నారసింహవపుః శ్రీమాన్ కేశవః పురుషోత్తమః ॥ 3

సర్వః శర్వః శివస్థాణుః భూతాదిర్నిధి రవ్యయః ।
సంభవో భావనో భర్తా ప్రభవః ప్రభురీశ్వరః ॥ 4

స్వయంభూః శంభురాదిత్యః పుష్కరాక్షో మహాస్వనః ।
అనాదినిధనో ధాతా విధాతా ధాతురుత్తమః ॥ 5

అప్రమేయో హృషీకేశః పద్మనాభో ఽమరప్రభుః ।
విశ్వకర్మా మనుస్త్వష్టా స్థవిష్ఠః స్థవిరో ధ్రువః ॥ 6

అగ్రాహ్య శ్శాశ్వతః కృష్ణో లోహితాక్షః ప్రతర్దనః ।
ప్రభూతః త్రికకుబ్ధామ పవిత్రం మంగళం పరమ్ ॥ 7

ఈశానః ప్రాణదః ప్రాణో జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః ।
హిరణ్యగర్భో భూగర్భో మాధవో మధుసూదనః ॥ 8

ఈశ్వరో విక్రమీధన్వీ మేధావీ విక్రమః క్రమః ।
అనుత్తమో దురాధర్షః కృతజ్ఞః కృతిరాత్మవాన్ ॥ 9

సురేశః శరణం శర్మ విశ్వరేతాః ప్రజాభవః ।
అహస్సంవత్సరో వ్యాళః ప్రత్యయః సర్వదర్శనః ॥ 10

అజ స్సర్వేశ్వరస్సిద్ధః సిద్ధి స్సర్వాది రచ్యుతః ।
వృషాకపిరమేయాత్మా సర్వయోగ వినిస్సృతః ॥ 11

వసుర్వసుమనాస్సత్యః సమాత్మా ఉ సమ్మితస్సమః ।
అమోఘః పుండరీకాక్షో వృషకర్మా వృషాకృతిః ॥ 12

రుద్రో బహుశిరా బభ్రుః విశ్వయోని శ్శుచిశ్రవాః ।
అమృత శ్శాశ్వత స్థాణుః వరారోహో మహాతపాః ॥ 13

సర్వగః సర్వవిద్భానుః విష్వక్సేనో జనార్దనః ।
వేదోవేదవిదవ్యంగో వేదాంగో వేదవిత్కవిః ॥ 14

లోకాధ్యక్షః సురాధ్యక్షో ధర్మాధ్యక్షః కృతాకృతః ।
చతురాత్మా చతుర్వ్యూహః చతుర్దంష్ట్రః చతుర్భుజః ॥ 15

భ్రాజిష్ణుః భోజనం భోక్తా సహిష్ణుః జగదాదిజః ।
అనఘో విజయో జేతా విశ్వయోనిః పునర్వసుః ॥ 16

ఉపేంద్రో వామనః ప్రాంశుః అమోఘః శుచిరూర్జితః ।
అతీంద్రః సంగ్రహస్సర్గో ధృతాత్మా నియమో యమః ॥ 17

వేద్యోవైద్యః సదాయోగీ వీరహా మాధవో మధుః ।
అతీంద్రియో మహామాయో మహోత్సాహో మహాబలః ॥ 18

మహాబుద్ధిః మహావీర్యో మహాశక్తిః మహాద్యుతిః ।
అనిర్దేశ్యవపుః శ్రీమాన్ అమేయాత్మా మహాద్రి ధృక్ ॥ 19

మహేష్వాసో మహీభర్తా శ్రీనివాసః సతాంగతిః ।
అనిరుద్ధ స్సురానందో గోవిందో గోవిదాం పతిః ॥ 20

మరీచి ర్దమనో హంసః సుపర్ణో భుజగోత్తమః ।
హిరణ్యనాభః సుతపాః పద్మనాభః ప్రజాపతిః ॥ 21

అమృత్యుః సర్వదృక్సింహః సంధాతా సంధిమాన్ స్థిరః ।
అజో దుర్మర్షణః శాస్తా విశ్రుతాత్మా సురారిహా ॥ 22

గురుర్గురుతమో ధామ సత్యస్సత్య పరాక్రమః ।
నిమిషో ఽ నిమిషః స్రగ్వీ వాచస్పతి రుదారధీః ॥ 23

అగ్రణీః గ్రామణీః శ్రీమాన్ న్యాయోనేతా సమీరణః ।
సహస్రమూర్ధా విశ్వాత్మా సహస్రాక్షః సహస్రపాత్ ॥ 24

ఆవర్తనో నివృత్తాత్మా సంవృతః సంప్రమర్దనః ।
అహస్సంవర్తకో వహ్నిః అనిలో ధరణీధరః ॥ 25

సుప్రసాదః ప్రసన్నాత్మా విశ్వదృగ్విశ్వభు గ్విభుః ।
సత్కర్తా సత్కృత స్సాధుః జహ్నుర్నారాయణో నరః ॥ 26

అసంఖ్యేయో ఽ ప్రమేయాత్మా విశిష్టః శిష్టకృచ్ఛుచిః ।
సిద్ధార్థః సిద్ధ సంకల్పః సిద్ధిద స్సిద్ధి సాధనః ॥ 27

వృషాహీ వృషభో విష్ణుః వృషపర్వా వృషోదరః ।
వర్ధనో వర్ధమానశ్చ వివిక్తః శ్రుతిసాగరః ॥ 28

సుభుజో దుర్ధరో వాగ్మీ మహేంద్రో వసుదో వసుః ।
నైకరూపో బృహద్రూపః శిపివిష్టః ప్రకాశనః ॥ 29

ఓజస్తేజో ద్యుతిధరః ప్రకాశాత్మా ప్రతాపనః ।
ఋద్ధః స్పష్టాక్షరో మంత్రః చంద్రాంశు ర్భాస్కర ద్యుతిః ॥ 30

అమృతాంశూద్భవో భానుః శశిబిందు స్సురేశ్వరః ।
ఔషధం జగతః సేతుః సత్యధర్మ పరాక్రమః ॥ 31

భూతభవ్య భవన్నాథః పవనః పావనో ఽనలః ।
కామహా కామకృత్కాంతః కామః కామప్రదః ప్రభుః ॥ 32

యుగాదికృ ద్యుగావర్తో నైకమాయో మహాశనః ।
అదృశ్యో వ్యక్తరూపశ్చ సహస్రజి దనంతజిత్ ॥ 33

ఇష్టో ఽవిశిష్టః శిష్టేష్టః శిఖండీ నహుషో వృషః ।
క్రోధహా క్రోధకృత్కర్తా విశ్వబాహుః మహీధరః ॥ 34

అచ్యుతః ప్రథితః ప్రాణః ప్రాణదో వాసవానుజః ।
అపాం నిధి రధిష్ఠాన మప్రమత్తః ప్రతిష్ఠితః ॥ 35

స్కందః స్కందధరో ధుర్యో వరదో వాయు వాహనః ।
వాసుదేవో బృహద్భానుః ఆదిదేవః పురందరః ॥ 36

అశోకస్తారణ స్తారః శూరః శౌరిర్జనేశ్వరః ।
అనుకూలః శతావర్తః పద్మీపద్మనిభేక్షణః ॥ 37

పద్మనాభో ఽరవిందాక్షః పద్మగర్భః శరీరభృత్ ।
మహర్ధిః ఋద్ధో వృద్ధాత్మా మహాక్షో గరుడధ్వజః ॥ 38

అతులః శరభో భీమః సమయజ్ఞో హవిర్హరిః ।
సర్వలక్షణ లక్షణ్యో లక్ష్మీవాన్ సమితింజయః ॥ 39

విక్షరో రోహితో మార్గో హేతు ర్దామోదర స్సహః ।
మహీధరో మహాభాగో వేగవానమితాశనః ॥ 40

ఉద్భవః క్షోభణో దేవః శ్రీగర్భః పరమేశ్వరః ।
కరణం కారణం కర్తా వికర్తా గహనో గుహః ॥ 41

వ్యవసాయో వ్యవస్థానః సంస్థానః స్థానదో ధ్రువః ।
పరర్ధిః పరమస్పష్టః తుష్టః పుష్టః శుభేక్షణః ॥ 42

రామో విరామో విరతో మార్గోనేయో నయోఽనయః ।
వీరః శక్తిమతాం శ్రేష్ఠో ధర్మోధర్మవిదుత్తమః ॥ 43

వైకుంఠః పురుషః ప్రాణః ప్రాణదః ప్రణవః పృథుః ।
హిరణ్యగర్భః శత్రుఘ్నో వ్యాప్తో వాయురధోక్షజః ॥ 44

ఋతుః సుదర్శనః కాలః పరమేష్ఠీ పరిగ్రహః ।
ఉగ్రః సంవత్సరో దక్షో విశ్రామో విశ్వదక్షిణః ॥ 45

విస్తారః స్థావరః స్థాణుః ప్రమాణం బీజమవ్యయం ।
అర్థోఽనర్థో మహాకోశో మహాభోగో మహాధనః ॥ 46

అనిర్విణ్ణః స్థవిష్ఠోఽభూ ర్ధర్మయూపో మహామఖః ।
నక్షత్రనేమి ర్నక్షత్రీ క్షమః క్షామ స్సమీహనః ॥ 47

యజ్ఞఇజ్యో మహేజ్యశ్చ క్రతుస్సత్రం సతాంగతిః ।
సర్వదర్శీ విముక్తాత్మా సర్వజ్ఞో జ్ఞానముత్తమమ్ ॥ 48

సువ్రతః సుముఖః సూక్ష్మః సుఘోషః సుఖదః సుహృత్ ।
మనోహరో జితక్రోధో వీరబాహు ర్విదారణః ॥ 49

స్వాపనః స్వవశో వ్యాపీ నైకాత్మా నైకకర్మకృత్ ।
వత్సరో వత్సలో వత్సీ రత్నగర్భో ధనేశ్వరః ॥ 50

ధర్మగుబ్ధర్మకృద్ధర్మీ సదసత్ క్షరమక్షరం ।
అవిజ్ఞాతా సహస్రాంశుః విధాతా కృతలక్షణః ॥ 51

గభస్తినేమిః సత్త్వస్థః సింహో భూతమహేశ్వరః ।
ఆదిదేవో మహాదేవో దేవేశో దేవభృద్గురుః ॥ 52

ఉత్తరో గోపతిర్గోప్తా జ్ఞానగమ్యః పురాతనః ।
శరీరభూతభృత్ భోక్తా కపీంద్రో భూరిదక్షిణః ॥ 53

సోమపో ఽ మృతపస్సోమః పురుజిత్ పురుసత్తమః ।
వినయో జయః సత్యసంధో దాశార్హః సాత్వతాంపతిః ॥ 54

జీవో వినయితాసాక్షీ ముకుందో ఽ మిత విక్రమః ।
అంభోనిధిరనంతాత్మా మహోదధిశయో ఽ న్తకః ॥ 55

అజో మహార్హః స్వాభావ్యో జితామిత్రః ప్రమోదనః ।
ఆనందో నందనోనందః సత్యధర్మా త్రివిక్రమః ॥ 56

మహర్షిః కపిలాచార్యః కృతజ్ఞో మేదినీపతిః ।
త్రిపదః త్రిదశాధ్యక్షో మహాశృంగః కృతాన్తకృత్ ॥ 57

మహావరాహో గోవిందః సుషేణః కనకాంగదీ ।
గుహ్యో గభీరో గహనో గుప్తశ్చక్రగదాధరః ॥ 58

వేధాః స్వాంగో ఽ జితః కృష్ణో దృఢః సంకర్షణో ఽ చ్యుతః ।
వరుణో వారుణో వృక్షః పుష్కరాక్షో మహామనాః ॥ 59

భగవాన్ భగహా ఽ నందీ వనమాలీ హలాయుధః ।
ఆదిత్యో జ్యోతిరాదిత్యః సహిష్ణుర్గతిసత్తమః ॥ 60

సుధన్వా ఖండపరశుః దారుణో ద్రవిణప్రదః ।
దివస్పృక్ సర్వదృగ్ వ్యాసో వాచస్పతిరయోనిజః ॥ 61

త్రిసామా సామగః సామ నిర్వాణం భేషజం భిషక్ ।
సన్న్యాసకృచ్ఛమః శాంతో నిష్ఠా శాంతిః పరాయణం ॥ 62

శుభాంగః శాంతిదః స్రష్టా కుముదః కువలేశయః ।
గోహితో గోపతిర్గోప్తా వృషభాక్షో వృషప్రియః ॥ 63

అనివర్తీ నివృత్తాత్మా సంక్షేప్తా క్షేమకృచ్ఛివః ।
శ్రీవత్సవక్షాః శ్రీవాసః శ్రీపతిః శ్రీమతాంవరః ॥ 64

శ్రీదః శ్రీశః శ్రీనివాసః శ్రీనిధిః శ్రీవిభావనః ।
శ్రీధరః శ్రీకరః శ్రేయః శ్రీమాన్ లోకత్రయాశ్రయః ॥ 65

స్వక్షః స్వంగః శతానందో నందిః జ్యోతిర్గణేశ్వరః ।
విజితాత్మా విధేయాత్మా సత్కీర్తిశ్ఛిన్నసంశయః ॥ 66

ఉదీర్ణః సర్వతశ్చక్షు రనీశః శాశ్వతస్థిరః ।
భూశయో భూషణో భూతిః విశోకః శోకనాశనః ॥ 67

అర్చిష్మా నర్చితః కుంభో విశుద్ధాత్మా విశోధనః ।
అనిరుద్ధో ఽ ప్రతిరథః ప్రద్యుమ్నోఽ మిత విక్రమః ॥ 68

కాలనేమినిహా వీరః శౌరిః శూరజనేశ్వరః ।
త్రిలోకాత్మా త్రిలోకేశః కేశవః కేశిహా హరిః ॥ 69

కామదేవః కామపాలః కామీ కాంతః కృతాగమః ।
అనిర్దేశ్యవపుః విష్ణుః వీరో ఽ నంతో ధనంజయః ॥ 70

బ్రహ్మణ్యో బ్రహ్మకృత్ బ్రహ్మా బ్రహ్మ బ్రహ్మవివర్ధనః ।
బ్రహ్మవిత్ బ్రాహ్మణో బ్రహ్మీ బ్రహ్మజ్ఞో బ్రాహ్మణ ప్రియః ॥ 71

మహాక్రమో మహాకర్మా మహాతేజా మహోరగః ।
మహాక్రతు ర్మహాయజ్వా మహాయజ్ఞో మహాహవిః ॥ 72

స్తవ్యః స్తవప్రియః స్తోత్రం స్తుతిః స్తోతా రణప్రియః ।
పూర్ణః పూరయితా పుణ్యః పుణ్యకీర్తి రనామయః ॥ 73

మనోజవః తీర్థకరో వసురేతా వసుప్రదః ।
వసుప్రదో వాసుదేవో వసుర్వసుమనా హవిః ॥ 74

సద్గతిః సత్కృతిః సత్తా సద్భూతిః సత్పరాయణః ।
శూరసేనో యదుశ్రేష్ఠః సన్నివాసః సుయామునః ॥ 75

భూతావాసో వాసుదేవః సర్వాసునిలయో ఽనలః ।
దర్పహా దర్పదో దృప్తో దుర్ధరో ఽథాపరాజితః ॥ 76

విశ్వమూర్తి ర్మహామూర్తిః దీప్తమూర్తి రమూర్తిమాన్ ।
అనేక మూర్తిరవ్యక్తః శతమూర్తిః శతాననః ॥ 77

ఏకో నైకః సవః కః కిం యత్తత్పదమనుత్తమం ।
లోకబంధుః లోకనాథో మాధవో భక్త వత్సలః ॥ 78

సువర్ణవర్ణో హేమాంగో వరాంగశ్చందనాంగదీ ।
వీరహా విషమః శూన్యో ఘృతాశీరచలశ్చలః ॥ 79

అమానీ మానదో మాన్యో లోకస్వామీ త్రిలోక ధృత్ (క్)
సుమేధా మేధజో ధన్యః సత్యమేధా ధరాధరః ॥ 80

తేజోవృషో ద్యుతిధరః సర్వశస్త్ర భృతాంవరః ।
ప్రగ్రహో నిగ్రహో వ్యగ్రో నైకశృంగో గదాగ్రజః ॥ 81

చతుర్మూర్తిః చతుర్బాహుః చతుర్వ్యూహశ్చతుర్గతిః ।
చతురాత్మా చతుర్భావః చతుర్వేదవిదేకపాత్ ॥ 82

సమావర్తో ఽనివృత్తాత్మా దుర్జయో దురతిక్రమః ।
దుర్లభో దుర్గమో దుర్గో దురావాసో దురారిహా ॥ 83

శుభాంగో లోకసారంగః సుతంతుః తంతువర్ధనః ।
ఇంద్రకర్మా మహాకర్మా కృతకర్మా కృతాగమః ॥ 84

ఉద్భవః సుందరః సుందో రత్ననాభః సులోచనః ।
అర్కో వాజసనః శృంగీ జయంతః సర్వవిజ్జయీ ॥ 85

సువర్ణబిందు రక్షోభ్యః సర్వ వాగీశ్వరేశ్వరః ।
మహాహ్రదో మహాగర్తో మహాభూతో మహానిధిః ॥ 86

కుముదః కుందరః కుందః పర్జన్యః పావనో ఽనిలః ।
అమృతాంశో ఽమృతవపుః సర్వజ్ఞః సర్వతోముఖః ॥ 87

సులభః సువ్రత స్సిద్ధః శత్రుజిత్ శత్రుతాపనః ।
న్యగ్రోధో ఽదుంబరోఽశ్వత్థః చాణూరాంధ్రనిషూదనః ॥ 88

సహస్రార్చిః సప్తజిహ్వః సప్తైధాః సప్తవాహనః ।
అమూర్తి రనఘోఽచింత్యో భయకృద్భయ నాశనః ॥ 89

అణుర్బృహత్ కృశః స్థూలో గుణభృన్నిర్గుణో మహాన్ ।
అధృతః స్వధృతః స్వాస్యః ప్రాగ్వంశో వంశవర్ధనః ॥ 90

భారభృత్కథితో యోగీ యోగీశః సర్వకామదః ।
ఆశ్రమః శ్రమణః క్షామః సుపర్ణో వాయువాహనః ॥ 91

ధనుర్ధరో ధునర్వేదో దండోదమయితా దమః ।
అపరాజితః సర్వసహో నియంతా ఽ నియమో ఽ యమః ॥ 92

సత్త్వవాన్ సాత్త్వికః సత్యః సత్యధర్మపరాయణః ।
అభిప్రాయః ప్రియార్హో ఽ ర్హః ప్రియకృత్ప్రీతివర్ధనః ॥ 93

విహాయసగతిర్జ్యోతిః సురుచిఃర్హుతభుగ్విభుః ।
రవిర్విరోచనః సూర్యః సవితా రవిలోచనః ॥ 94

అనంతో హుతభుగ్ భోక్తా సుఖదో నైకదో ఽ గ్రజః ।
అనిర్విణ్ణః సదామర్షీ లోకాధిష్ఠాన మద్భుతః ॥ 95

సనాత్ సనాతనతమః కపిలః కపిరవ్యయః ।
స్వస్తిదః స్వస్తికృత్ స్వస్తి స్వస్తిభుక్ స్వస్తిదక్షిణః ॥ 96

అరౌద్రః కుండలీ చక్రీ విక్రమ్యూర్జితశాసనః ।
శబ్దాతిగః శబ్దసహః శిశిరః శర్వరీకరః ॥ 97

అక్రూరః పేశలో దక్షో దక్షిణః క్షమిణాం వరః ।
విద్వత్తమో వీతభయః పుణ్యశ్రవణకీర్తనః ॥ 98

ఉత్తారణో దుష్కృతిహా పుణ్యో దుస్స్వప్ననాశనః ।
వీరహా రక్షణః సంతో జీవనః పర్యవస్థితః ॥ 99

అనంతరూపో ఽ నంత శ్రీః జితమన్యుః భయాపహః ।
చతురశ్రో గభీరాత్మా విదిశో వ్యాదిశో దిశః ॥ 100

అనాదిః భూర్భువో లక్ష్మీః సువీరో రుచిరాంగదః ।
జననో జనజన్మాదిః భీమో భీమపరాక్రమః ॥ 101

ఆధారనిలయో ఽ ధాతా పుష్పహాసః ప్రజాగరః ।
ఊర్ధ్వగః సత్పథాచారః ప్రాణదః ప్రణవః పణః ॥ 102

ప్రమాణం ప్రాణనిలయః ప్రాణభృత్ ప్రాణజీవనః ।
తత్త్వం తత్వవిదేకాత్మా జన్మమృత్యు జరాతిగః ॥ 103

భూర్భువః స్వస్తరుస్తారః సవితా ప్రపితామహః ।
యజ్ఞో యజ్ఞపతిర్యజ్వా యజ్ఞాంగో యజ్ఞవాహనః ॥ 104

యజ్ఞభృత్ యజ్ఞకృత్ యజ్ఞీ యజ్ఞభుక్ యజ్ఞసాధనః ।
యజ్ఞాన్తకృత్ యజ్ఞగుహ్య మన్నమన్నాద ఏవచ ॥ 105

ఆత్మయోనిః స్వయంజాతో వైఖాన స్సామగాయనః ।
దేవకీనందనః స్రష్టా క్షితీశః పాపనాశనః ॥ 106

శంఖభృన్నందకీ చక్రీ శార్ఙ్గధన్వా గదాధరః ।
రథాంగపాణి రక్షోభ్యః సర్వప్రహరణాయుధః ॥ 107

*(శ్రీ సర్వ ప్రహరణాయుధ ఓం నమ ఇతి)*

వనమాలీ గదీ శార్ఙ్గీశంఖీ చక్రీ చ నందకీ ।
శ్రీమన్నారాయణో విష్ణుః వాసుదేవో ఽభిరక్షతు ॥ 108